

# పల్లె వెలుగు


తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


చంద్రబాబు గో బ్యాక్.




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 176 పేజీలు - 08 వెల - 05/-

బుధవారం 24-06-2026


### గాదె సాయికృష్ణ కేసులో కీలక పరిణామం...

## కృష్ణలంక సీఐ నాగరాజు అరెస్టు

- విజయవాడలో యువకుడు సాయికృష్ణ అదృశ్యంపై విచారణ
- నాగరాజును అదుపులోకి తీసుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందం
- సీఐ అరెస్టును అడ్డుకునేందుకు మద్దతుదారుల ప్రయత్నం




ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ (25) అదృశ్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), సస్పెన్షన్‌కు గురైన కృష్ణలంక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్‌వీవీ

### జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీకి వైసీపీ

## నేత రాచమల్లు వార్నింగ్

- ఇటీవల జగన్ పై విమర్శలు గుప్పించిన నానాజీ
- ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ రాచమల్లు వార్నింగ్
- జగన్ దమ్ము ఏంటో పవన్ ను అడిగి తెలుసుకోవాలని వ్యాఖ్య




వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను టార్గెట్ చేస్తూ కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన వ్యాఖ్యలపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పంతం నానాజీ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ హెచ్చరించారు.

## హార్మ్యూజ్ జలసంధిలో

### రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా: ట్రంప్

- హార్మూజ్ జలసంధిలో ఒక్కరోజే 19 మిలియన్ బ్యారెళ్ల ఆయిల్ రవాణా
- ఇరాన్‌తో ఒప్పందం వల్లే ఇది సాధ్యమైందని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్
- ఈ పరిణామంతో ప్రపంచవ్యాప్తంగా తగ్గుముఖం పడుతున్న చమురు ధరలు

అమెరికా, ఇరాన్?ల మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం ఆశించిన సత్ఫలితాలనిస్తోందని, హార్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా తిరిగి భారీగా పుంజుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. సోమవారం ఒక్కరోజే ఈ జలసంధి గుండా 1.9




# 34 వేల ఉద్యోగాలకు మార్గం సుగమం

### మచిలీపట్నం, రామయ్యపట్నం పోర్టుల పరిధుల క్రమబద్ధీకరణ, పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు

- ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు.. రూ.39,355 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- రాష్ట్రంలో 34,610 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్
- అమరావతి పనుల వేగవంతం.. మౌలిక వసతులకు టెండర్లకు ఆమోదం
- కొందరు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం.. పీఎస్‌యూల్లో రిటైర్మెంట్ వయసు 62కి పెంపు



ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడం, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, పర్యాటక రంగం అభివృద్ధి వంటి అంశాలపై క్యాబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశానంతరం తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు.

**భారీగా పారిశ్రామిక పెట్టుబడులు**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) సిఫారసు చేసిన పలు ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. మొత్తం రూ.39,355 కోట్ల పెట్టుబడులతో, 34,610 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ఇందులో భాగంగా ఏర్పాటు చేయనున్న కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు:**

ప్రీమియర్ ఎనర్జీస్ (తిరుపతి): రూ.3,936 కోట్ల పెట్టుబడితో సిలికాన్ వేఫర్, మాడ్యూల్ తయారీ యూనిట్. 540 మందికి ఉపాధి. మిగతాది 2లో

## మెట్రో ఫేజ్-1, ఫేజ్-2పై

# కీలక నిర్ణయాలు

● కేంద్ర మంత్రులు మనోహర్ ఖట్టర్, ● అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి చర్చలు సఫలం ● ఫేజ్--x వాల్యూయేషన్.. ఫేజ్--xx విస్తరణకు కన్సల్టెంట్‌గా ఎస్‌బీఐసీఏపీఎస్ ● కన్సల్టెంట్ రిపోర్ట్ ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ● సమన్వయ సభ్యులుగా కేంద్ర ప్రభుత్వ అధికారి, రాష్ట్ర ఎంఏయూడీ స్పెషల్ సెక్రెటరీ



న్యూఢిల్లీ బ్యూరో :హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ అంశంలో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్--x స్వాధీనం, ఫేజ్--xx విస్తరణపై ఉన్న ఆటంకాలు తొలగనున్నాయి. కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డితో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన రెండ్రోజుల చర్చలు ఫలప్రదమైనట్టు సీఎంఓ ఒక ప్రకటనలో పేర్కొంది. మంగళవారం నాడిక్కడ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మిగతాది 2లో

## ఏసీబీ వలలో మరో పెద్ద చేప!

### నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరెస్ట్.. రూ.3 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు

● ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరెస్ట్ ● మల్లారెడ్డి, ఆయన బంధువుల ఇళ్లపై ఏసీబీ ఏకకాలంలో దాడులు ● సుమారు రూ.3 కోట్ల విలువైన అక్రమాస్తులు గుర్తించిన అధికారులు ● ఇటీవలే సర్వే శాఖ అధికారి నరహరిని అరెస్ట్ చేసిన ఏసీబీ ● వరుస దాడులతో అవినీతి అధికారుల్లో కలవరం




తెలంగాణలో అవినీతి అధికారులపై ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) వరుస దాడులు కొనసాగిస్తోంది. తాజాగా, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మురి మల్లారెడ్డిని ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. అవినీతి కార్యకలాపాలకు పాల్పడి, అక్రమ మార్గాల్లో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న మిగతాది 2లో

## ప్రకృతి వ్యవసాయంతో పశుగ్రాస

# భద్రతకు శ్రీకారం

### - వర్షాభావాన్ని అధిగమించేందుకు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రణాళిక



- పచ్చిమేత కొరత నివారణకు చర్యలు
- కరపత్రాలను విడుదల చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి, జూన్ 23: రాష్ట్రంలో రానున్న వ్యవసాయ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో పశుసంపద రక్షణ, పశుపోషకుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. మిగతాది 2లో

## రాయలసీమలో 'పసిడి' పంట

### రూ.405 కోట్లతో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ పెట్టుబడి

● స్వర్ణగిరిగా... ఇక జొన్నగిరి ● ఏడాదికి 400 కేజీలు, 900 కేజీలు, 2 టన్నులు- దశల వారీగా పెరగనున్న బంగారం వెలికితీత ● ఉత్పత్తి అయిన బంగారం విలువలో రాష్ట్ర ఖజానాకు 4 శాతం రాయల్టీ ● గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు




### బీసీల విద్యకు 'కూటమి'

# దన్ను

● కొత్తగా 10 బీసీ గురుకులాల ఏర్పాటు ● ఒక్కో గురుకులంలో 37 పోస్టుల భర్తీకి నిర్ణయం ● ఇటీవలే 6 ఎంజేపీలను కళాశాలలుగా అప్ గ్రేడ్ ● బడి బయట బీసీ బిడ్డలు ఉండకూడదనేదే సీఎం చంద్రబాబు లక్ష్యం ● నూతన గురుకులాల ఏర్పాటుపై మంత్రి సవిత హర్షం ● బీసీ విద్యకు ప్రాధాన్యమిస్తున్నందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు



# బీసీల విద్యకు 'కూటమి' దన్ను

అమరావతిలి : విద్యతోనే బీసీలు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోగలరనేది సీఎం చంద్రబాబునాయుడు బావన. ఇటీవల ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. ఇపుడు బీసీ విద్యార్థులకు మేలు కలిగేలా నూతన విద్య సంస్థలు నెలకొల్పాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొత్తగా పది మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కొత్త గురుకులాల్లో 37 మంది చొప్పున్న ఉద్యోగులను భర్తీ చేయనున్నారు. ఈమేరకు మంగళవారం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో బీసీ బిడ్డలందరూ విద్య అభ్యసించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బడి బయట ఏ బీసీ బిడ్డా ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశం. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక వైపు బీసీ హాస్టళ్లు, మరో ఎంజేపీ గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. సకాలంలో డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తోంది. మారుతున్న పరిస్థితులకనుగుణంగా సాంకేతిక విద్యకు కూడా ప్రాధాన్యమిస్తోంది. దీంతో బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎంజేపీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడం, కొత్త గురుకులాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టింది.

**ఇటీవల 6 గురుకులాలు అప్ గ్రేడ్**

ఎంజేపీ గురుకులాల సీట్లకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. కొత్తవలస(విజయనగరం), ఆత్మకూరు, గోలగముడి(నెల్లూరు), కలికిరి(అన్నమయ్య), ఓనిపెంట (కడప), నాసనకోట (శ్రీ సత్యసాయి జిల్లా) ఎంజేపీ గురుకుల పాఠశాలలను అప్ గ్రేడ్ చేశారు. ఆయా గురుకులాలల్లో తరగతలు సైతం ప్రారంభమయ్యాయి.

**కొత్తగా 10 గురుకులాల ఏర్పాటు**

తాజాగా కొత్త గురుకుల పాఠశాలలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన కేబినెట్ భేటీలో మంత్రమండలి ఆమోదం కూడా తెలిపింది. చ్చెర్ల(శ్రీకాకుళం), నక్కపల్లి(అనకాపల్లి), మాచెర్ల(పల్నాడు), గిద్దలూరు(మార్కాపురం), గుంతకల్లు(అనంతపురం), రాయచోటి(అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం(కర్నూలు), పెనుకొండ,కదిరి(శ్రీసత్యసాయి) లో ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో గురుకులంలో 37 బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ గురుకుల పాఠశాలలో అయిదు బాలికలు, మరో అయిదు బాలుర పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతలను ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నూతన ఎంజేపీ గురుకులాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లోని బీసీ బిడ్డలకు మరింత మేలు జరగనుంది.

**సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు**

బడి బయట ఏ ఒక్క బీసీ బిడ్డా ఉండకూడదనే సీఎం చంద్రబాబు లక్ష్యాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. బీసీల విద్యకు ప్రాధాన్యమిస్తూ, కొత్తగా పది ఎంజేపీ గురుకుల పాఠశాలల ఏర్పాటుపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. ఈ గురుకులాల ఏర్పాటుతో మరింతమంది పేద బీసీ బిడ్డలు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఎంజేపీ గురుకులాల్లో ఆహార భద్రత, రక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. గత నెలలో విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బీసీ బిడ్డలు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఇటీవలే ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా కూటమి ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందన్నారు. బీసీల విద్య కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

# రాయలసీమలో 'పసిడి' పంట

అమరావతి, జూన్ 23:-బంగారు నిక్షేపాల గని అంటే



కర్నాటక రాష్ట్రంలోని కేజీఎఫ్ గుర్తొచ్చేది... కానీ ఇప్పుడు ఆ స్థానంలో జొన్నగిరి పేరు మారుమోగనుంది. కరవు కేకలు వినిపించిన ఒకప్పటి కర్నూలు జిల్లా ఇక బంగారం ఉత్పత్తికి ప్రధాన వేదిక కానుంది. దేశంలోనే ప్రైవేట్ రంగంలో అతిపెద్ద గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఏర్పాటైంది. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌కు ప్రభుత్వం 1,500 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రస్తుతం మొదటి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు జరగనున్నాయి. దీనికి తగినట్టుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. రెండో దశలో మిగిలిన ప్రాంతంలోనూ ప్లాంట్ విస్తరించున్నారు. ప్రస్తుతం ఏర్పాటైన ఈ ప్లాంట్ ద్వారా తొలి ఏడాదికి 400 కిలోల పసిడిని ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి 900 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తారు. ఈ రకంగా ఏ ఏడాదికి ఆ ఏడాది ఉత్పత్తి పెరుగుతూ... ఏడాదికి 2 టన్నుల వరకు బంగారం ఉత్పత్తి చేయనున్నారు. ఈ మేరకు ప్లాంట్ సామర్థ్యాన్ని ప్రాసెసింగ్ కెపాసిటీని విస్తరించనున్నారు. ఈ ప్లాంట్ ద్వారా 700 మందికి ఉపాధి లభిస్తుంది. ఇక ఉత్పత్తి చేసిన బంగారం ధరలో 4 శాతం రాష్ట్రానికి రాయల్టీగా వస్తుంది. మొదట తీసే 400 కేజీలకు రూ.57 కోట్లు, 900 కేజీలకు రూ.144 కోట్ల వరకూ రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రానుంది.

**ప్రారంభోత్సవం... శంకుస్థాపన**

కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. అనంతరం ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ శంకుస్థాపన చేయనున్నారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు రూ.405 కోట్ల పెట్టుబడితో బంగారు నిక్షేపాలు వెలికితీసే ఈ కర్మాగారాన్ని నెలకొల్పాయి. ఇందుకు అవసరమైన నీటి కోసం హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 18 కి.మీ. పైపులైన్‌తో 0.021 టీఎంసీలను వినియోగించనున్నారు. ఈ మేరకు రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బంగారం ఉత్పత్తి పనులు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే గనిలో ట్రయల్ రన్స్ కూడా పూర్తయ్యాయి.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

కర్నూలు జిల్లాలో బుధవారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం సహా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు జొన్నగిరికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రారంభించి... అనంతరం జీఈఓ మైసూర్ ప్లాంట్ రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు జొన్నగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 3 గంటలకు పత్తికొండ నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు

# మెట్రో ఫేజ్-1, ఫేజ్-2పై కీలక నిర్ణయాలు

కృష్ణ మీనన్ మార్గ్ లోని ఖట్టర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ సమావేశంలో హైదరాబాద్ మెట్రో ఫేజ్--× వాల్యూయేషన్, ఫేజ్--× స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, ఇతర అంశాలపై కీలకంగా చర్చించారు. అలాగే మెట్రో ఫేజ్ --2 పై చర్చలు జరిపారు. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు, ఆలోచనలను సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రుల ముందుం చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో కేంద్ర సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా ఫేజ్ 1 కు నిధుల సేకరణ, ఫేజ్ --2 విస్తరణ విషయంలో అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**సీఎం, కేంద్ర మంత్రుల మధ్య ఏకాభిప్రాయం**

వరుసగా జరిగిన ఈ సమావేశాల్లో సీఎం, కేంద్ర మంత్రుల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్--× వాల్యూయేషన్, ఫేజ్--× స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్--×× విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ ను నియమించాలని నిర్ణయించారు. కన్సల్టెంట్‌గా ఎస్బీఐసీఏపీఎస్ ని ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్--× వాల్యూయేషన్... ఫేజ్-×× విస్తరణ.. ఇతర అంశాలపై ఎస్బీఐసీఏపీఎస్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే రిపోర్ట్ ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టేందుకు అంగీకారం తెలిపారు. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (ఎంఏ ఉయూడీ) శాఖ స్పెషల్ సెక్రెటరీ ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసు కుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారని సీఎంఓ తెలిపింది.

***కాగా హైదరాబాద్ డెవలప్‌మెంట్‌లో ప్రధాన భూమిక పోషించనున్న హైదరాబాద్ మెట్రో విస్తరణ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో రెండ్రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం రాత్రి ఢిల్లీలోని రైల్వే భవన లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ భేటీలో మెట్రో ఫేజ్ --1 కు ఇండియన్ రైల్వేఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్సీ) లోన్ పై చర్చించారు. అలాగే మెట్రో సెకండ్ ఫేజ్ అనుమ తుల వ్యవహారంలో అడ్డంకులపై చర్చిం చారు. అయితే ఈ భేటీలో మెట్రో విస్తరణ, నిధుల సమ కూర్పుపై సానుకూలత వచ్చినట్లు భేటీ అనంతరం సీఎం వెల్లడించారు. ఈ విషయంలో మరింత ముందుకు వెళ్లే అంశంపై... నోడల్ ఆఫీసర్‌గా ఉన్న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో చర్చించాలని ఈ మీటింగ్ లో నిర్ణయించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో కేంద్ర మంత్రులు ఫోన్ లో మాట్లాడారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, అనుమతులు, నిధుల సేకరణ, ఇతర అంశాలపై చర్చించేందుకు కేంద్ర మంత్రి ఖట్టర్ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.***

## ప్రకృతి వ్యవసాయంతో పశుగ్రాస భద్రతకు శ్రీకారం

వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పశువులకు పచ్చిమేత కొరత తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో పశుసంవర్ధక శాఖ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పశుగ్రాసాల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా "ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ (గ్రావీణా)" విధానంపై రూపొందించిన అవగాహన కరపత్రాలను రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంతో పాటు పశుసంపదపై కూడా పడుతున్న నేపథ్యంలో రైతులు, పశు పోషకులు పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ ప్రకృతి వ్యవసాయ సాంకేతికతలను అనుసరించడం ద్వారా మెరుగైన పశుగ్రాస దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పచ్చిమేత లభ్యత, పశుగ్రాస నిల్వ, తాగునీటి వసతులు, పశుసంరక్షణ చర్యలపై సమగ్ర సమాచారం అందించేందుకు ఈ కరపత్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా రైతులు, పశుపోషకులకు ఈ కరపత్రాలను పంపిణీ చేసి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పశుసంపద పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా పశుపోషకులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం ద్వారా పశుసంపదను సంరక్షించుకోవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, పశుపోషకులకు అవగాహన కల్పించేందుకు ఈ కరపత్రాలను ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పీతల సుజాత, పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు, శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాదె సాయికృష్ణ కేసులో కీలక పరిణామం...

# కృష్ణలంక సీఐ నాగరాజు అరెస్టు

ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), సస్పెన్షన్‌కు గురైన కృష్ణలంక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్‌వీవీ నాగరాజును అదుపులోకి తీసుకుంది. గత మే 9న కృష్ణలంక పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారని, ఆ తర్వాత అతను కనిపించకుండా పోయాడని బాధితుడి తల్లి విజయలక్ష్మి ఆరోపించారు. పోలీసులు తన కుమారుడిని చిత్రహింసలకు గురిచేసి చంపేసి, మృతదేహాన్ని మాయం చేశారని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, సీఐ నాగరాజును సస్పెండ్ చేయడంతో పాటు సమగ్ర విచారణ కోసం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో, సీఐ నాగరాజుపై హత్య, అక్రమ నిర్బంధం వంటి అభియోగాలతో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంగళవారం సిట్ అధికారులు విజయవాడ సింగ్ నగర్‌లోని నాగరాజు నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, నాగరాజును విచారణ నిమిత్తం సిట్ కార్యాలయానికి తరలించారు. అక్కడ సుమారు ఐదు గంటల పాటు సుదీర్ఘంగా విచారించిన అనంతరం ఆయనను అరెస్టు చేశారు. నాగరాజు అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని సిట్ అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

# ఏసీబీ వలలో మరో పెద్ద చేప...

ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. అవినీతి కార్యకలాపాలకు పాల్పడి, అక్రమ మార్గాల్లో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో మల్లారెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో భాగంగా మంగళవారం మల్లారెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, బినామీలకు చెందిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో ఐదు భవనాలు (నాలుగు ఇళ్లు, ఒక వాణిజ్య సముదాయం), 8 ఖాళీ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు గుర్తించారు. వీటితో పాటు రూ.3.31 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.50 లక్షలు, ఒక గ్రాండ్ విటారా కారు, ఒక టీవీఎస్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తుల డాక్యుమెంట్ విలువ సుమారు రూ.3 కోట్లు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ చాలా రెట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది. మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న మూడు బ్యాంక్ లాకర్లను కూడా గుర్తించామని, వాటిని విచారణలో భాగంగా త్వరలోనే తెరుస్తామని అధికారులు తెలిపారు. నిందితుడిని ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నారు. వారం రోజుల క్రితమే ల్యాండ్స్ అండ్ సర్వేస్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని కూడా ఏసీబీ ఇలాగే అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. నరహరి కేసులో సుమారు రూ.13 కోట్లకు పైగా ఆస్తులు, రూ.1.54 కోట్ల నగదు, భారీగా బంగారం వెలుగుచూశాయి. వరుస అరెస్టులతో అవినీతి అధికారుల్లో కలవరం మొదలైంది.

## జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీకి వైసీపీ నేత రాచమల్లు వార్నింగ్

అధికారంలో ఉన్నామనే అహంకారంతో కూటమి నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని రాచమల్లు మండిపడ్డారు. "జగన్ దమ్ము, ధైర్యం ఏంటో పంతం నానాజీకి తెలియాలంటే ముందు ఢిల్లీలోని పెద్ద పెద్ద లీడర్లను అడగాలి. ఒంటరిగా పోరాడి, కేంద్రంలో ఉన్న పెద్ద పెద్ద వ్యవస్థలను సైతం ధైర్యంగా ఎదుర్కొన్న చరిత్ర జగన్ ది. అక్కడ కూడా తెలియకపోతే.. స్వయంగా మీ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను అడిగితే జగన్ దమ్ము ఏంటో చాలా స్పష్టంగా చెబుతారు" అంటూ ఎద్దేవా చేశారు. కేవలం అధికార బలం చూసుకుని నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని కూటమి నాయకులకు హితవు పలికారు. రాజకీయంలో విమర్శలు చేసేటప్పుడు కనీస స్థాయి మరిచి మాట్లాడే చౌకబారు సంస్కృతిని మానుకోవాలని స్పష్టం చేశారు. తాము ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోయి ప్రతిపక్షంలో ఉన్నంత మాత్రాన ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

# 34 వేల ఉద్యోగాలకు మార్గం సుగమం

ప్రీమియర్ ఎనర్జీస్ (తిరుపతి): రూ.3,936 కోట్ల పెట్టుబడితో సిలికాన్ వేఫర్, మాడ్యూల్ తయారీ యూనిట్. 540 మందికి ఉపాధి.
కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ (అనకాపల్లి): రూ.2,788 కోట్ల పెట్టుబడితో 1000 మెగావాట్ల డేటా సెంటర్.
ప్రొటేరియల్ ఇండియా (అనకాపల్లి): రూ.2,250 కోట్ల పెట్టుబడితో నియోడిమియం ఐరన్ బోరాన్ మాగ్నెట్ తయారీ పరిశ్రమ. 530 మందికి ఉపాధి.
నాఖీమాచీజు ఇండియా (కాకినాడ): రూ.1,900 కోట్ల పెట్టుబడితో వాడిన వంట నూనెల నుంచి విమాన ఇంధనం తయారు చేసే యూనిట్. 2,500 మందికి ఉపాధి. ఎన్ఎస్ మాగ్నటెక్ (తిరుపతి): రూ.1,250 కోట్ల పెట్టుబడితో రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ తయారీ. 400 మందికి ఉపాధి.
ఏపీ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (ప్రకాశం): రూ.1,230 కోట్లతో స్టీల్ బెనిఫికేషన్ ప్లాంట్. వీటితో పాటు రేర్ ఎర్త్ మెటల్స్ వెలికితీత, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికంగా ఎండ్-టు-ఎండ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**అమరావతికి జవసత్వాలు**

ఐదేళ్లుగా నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ కోసం గతంలో టాబ్ ట్రీడ్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 35,000 టన్నుల సామర్థ్యంతో కొత్త వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం. ల్యాండ్ పూలింగ్ రైతులకు కేటాయించిన ప్లాట్లలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులకు సంబంధించిన టెండర్లకు ఆమోదం. రైతుల ప్లాట్ల సరిహద్దుల వివాదాలను పరిష్కరించేందుకు అవసరమైన రెక్టిఫికేషన్ డీడ్‌లపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి మినహాయింపు. పనుల పర్యవేక్షణ కోసం ఏపీసీఆర్‌డీఏలో 95 తాత్కాలిక పోస్టుల (డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు) మంజూరు.
ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణానికి రూ.130.38 కోట్లకు టెండర్ ఆమోదం.

**ఉద్యోగులకు శుభవార్త**

ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లపై క్యాబినెట్ సానుకూలంగా స్పందించింది. 2004కు ముందు నోటిఫికేషన్ పొంది, ఆ తర్వాత నియామకం అయిన 2003 డీఎస్సీ టీచర్లు, 10/99 గ్రూప్-1 ఉద్యోగులు సహా మొత్తం 10,715 మంది సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) వర్తింపజేయాలని నిర్ణయించింది. షెడ్యూల్ 9, 10 పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 62 ఏళ్లు పూర్తికాని రిటైర్డ్ ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరేందుకు అవకాశం కల్పించారు. **పోర్టులు,**

**పర్యాటకం, ఇతర నిర్ణయాలు**

పోర్టుల అభివృద్ధి: కేంద్ర ప్రభుత్వ నూతన చట్టాలకు అనుగుణంగా మచిలీపట్నం పోర్టు పరిధిని 64 కి.మీ. నుంచి 15 కి.మీ.కు, రామయ్యపట్నం పోర్టు పరిధిని 51 కి.మీ. నుంచి 15 కి.మీ.కు కుదిస్తూ నోటిఫికేషన్ల జారీకి ఆమోదం. రామయ్యపట్నం పోర్టును డీబీఎఫ్ఓటీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ఆపరేటర్ నియామకానికి ఆర్ఎఫ్‌పీ జారీకి అనుమతి. పర్యాటకం: గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'హోమ్ స్టే', 'బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' ఏర్పాటును సులభతరం చేస్తూ పర్యాటక పాలసీకి సవరణలు. తిరుపతి మినహా రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో బార్లు, రిటైల్ మద్యం దుకాణాల ఏర్పాటుకు నూతన విధానానికి ఆమోదం.
రవాణా శాఖ: ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న టూరిస్ట్ బస్సులను రాష్ట్రంలోకి ఆకర్షించేందుకు, ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ వాహనాల త్రైమాసిక పన్నును ప్రతి సీటుకు రూ.4,000 నుంచి రూ.2,500కు తగ్గింపు.
ఆరోగ్యశ్రీ: నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నివారించేందుకు "బిల్ డిస్కౌంటింగ్ సిస్టమ్"కు ఆమోదం. దీనివల్ల ఆసుపత్రులు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకుల నుంచి తక్షణమే నిధులు పొందవచ్చు. పరిపాలన: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం సహా 28 జిల్లాల కలెక్టరేట్లలో పాలనను బలోపేతం చేసేందుకు అదనపు పోస్టుల క్రమబద్ధీకరణకు ఆమోదం. పునరుత్పాదక ఇంధనం: కడప జిల్లాలో 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఏపీఎస్పీసీఎల్‌కు భూమి కేటాయింపు. యాగంటి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 1000 మెగావాట్ల నుంచి 1500 మెగావాట్లకు పెంచేందుకు ఆమోదం. ఈ మేరకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్న అంశాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.



# జెడ్పీ పాఠశాల విద్యార్థులకురక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

దొర్నిపాడు జూన్ 23పల్లె వెలుగు న్యూస్ మండల కేంద్రమైన దొర్నిపాడు జడ్పీపాఠశాలలో



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీనంద్యాలవారిఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ పర్ల దస్తగిరి ఆదేశాల మేరకు విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్న కేశ్వరిఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ సందర్భంగా హెచ్ఎం,రెడ్ క్రాస్ సొసైటీ దొర్నిపాడుమండల నిర్వాహకుడునాగేంద్రలు మాట్లాడుతూ విద్యార్థులు రక్త గ్రూపు తెలుసుకోవడం వలన అత్యవసర సమయాలలో మీకు మీకుటుంబానికేకాకుండావేరే వ్యక్తులుఎవరైనా గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో ఉంటే రక్తం దానం చేయడానికి వీలుంటుంది అన్నారు,రక్త హీనతపై ,రక్తదానంపై బాలికలకు అవగాహన కల్పించారు,వేరొకరికి రక్తదానం చేసి జీవితాన్ని పంచండి వారిలో ఆశను నింపండి,అదేవిధంగా రక్త గ్రూపుతెలుసుకోండి ప్రాణదాతలుకండి మీరిచ్చే ఒక యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాలను కాపాడగలరు మానవత్వమే మన ధర్మం రక్తదానం మహాదానం అన్నారు రక్తహీనతను జయించడానికి మంచి పోషకాహారంతీసుకొని ఆరోగ్య వంతులుగా ఉండాలని బలంగా ఎదగాలని బాలికలకు సూచించారు, ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ల్యాబ్ టెక్నీషియన్ రామ్మోహన్ విద్యార్థినులు పాల్గొన్నారు

# వర్షం కురిసింది మినుము రైతుల కళ్ళల్లో ఆనందం వెలసింది



దొర్నిపాడుజూన్ 23 పల్లె వెలుగు న్యూస్ రైతులు మినుము పంట సాగు చేసి సుమారు 15 రోజులు కావస్తున్న వాన చినుకులు రాలకపోవడంతో వేసిన పంట ఎండ,గాలికివాడుతగిలి ఎండిపోయే దశకు చేరుకున్న సమయంలోవరుణదేవుడుకరుణించి వర్షం కురవడంతో రైతుల కనులలో ఆనందం వెలిసింది, రైతులు రమేష్ ,భాస్కర్ రామకృష్ణ మాట్లాడుతూ కురిసిన అరకొరకు వర్షానికి మినుము పంట సాగు చేశాం భూమాత దయవల్ల బాగా మొలక ఎత్తి ఆశాజనకంగా ఉన్నాయి, అయితే పది రోజులు కావస్తున్నా వాన జాడ లేకపోవడంతో వేసిన పంట ఎండి పోవాల్సి వస్తుందేమో అనుకుని నిరాశ చెందుతున్న తరుణంలో వరుణ దేవుడు కరుణించి వర్షం పడడంతో దిగులు తీరిందంటున్నారు, 20 రోజులు వర్షం లేకున్నా మొలకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు అంటున్నారు,



మరొకసారి వర్షం కురిస్తే పంట చేతికి వస్తుంది అంటున్నారు రైతన్నలు, కోవెలకుంట్ల నుండి దొర్నిపాడు ప్రజలకు తాగునీటి కొరకు సిపిడబ్ల్యు స్కీం నుండి పంట పొలాల్లో ఏర్పాటు చేసిన పైపులైన్లు లీకులు అయ్యి నీరు కారుతుండడంతో భూములు సేద్యాలుచేసుకోవడానికి ఇబ్బందికరంగ ఉంది వెంటనే సంబంధిత అధికారులుస్పందించి లీకులను పూడ్చాలని రైతులు కోరుచున్నారు

# పుట్టరాజ గవాయి పుణ్యాశ్రమం నుంచి ఈబీజీ గోవింద్ గౌడ్‌కు ప్రత్యేక ఆహ్వానం

హోళగుంద పల్లె వెలుగు జూన్ 23 తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు, ప్రజాసేవకుడు ఈబీజీ గోవింద్ గౌడ్‌కు కర్ణాటక రాష్ట్రంలోని గదగ్ జిల్లా ప్రసిద్ధ శ్రీ పుట్టరాజ గవాయి పుణ్యాశ్రమం నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా



పుణ్యాశ్రమం ప్రతినిధులు గోవింద్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, మఠం గురువుగారి చిత్రపటంతో పాటు ఆహ్వాన పత్రికను అందజేశారు. గోవింద్ గౌడ్ ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న సేవలను గుర్తించిన మఠం కమిటీ సభ్యులు మంజు జీరా వీరేష్, ఎల్. గణేష్, సి. చంద్రబసవ, బి. బసవరాజ్ తదితరులు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించారు. గదగ్‌లోని శ్రీ పుట్టరాజ గవాయి పుణ్యాశ్రమంలో జూలై నెలలో నిర్వహించనున్న జాతర, రథోత్సవ మహోత్సవాల సందర్భంగా జూలై 5న వేలాది మంది భక్తుల సమక్షంలో ప్రస్తుత పీఠాధిపతి శ్రీ కల్లయ్య అజ్జా చేతుల మీదుగా ఈబీజీ గోవింద్ గౌడ్‌కు ఘన సన్మానం జరగనుంది. మఠం విడుదల చేసిన అధికారిక ఆహ్వాన పత్రికలో గోవింద్ గౌడ్ పేరు ప్రత్యేకంగా ప్రచురించడం ఆయనకు లభించిన గౌరవానికి నిదర్శనంగా నిలిచింది. ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న గోవింద్ గౌడ్‌కు దక్కిన ఈ అరుదైన గౌరవం హొళగుంద మండల ప్రజలకు, తెలుగు దేశం పార్టీ శ్రేణులకు గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు.

# జి రాంజీ నూతన చట్టం ద్వారా వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి .




పల్లె వెలుగు నంద్యాల రూరల్. కేంద్ర ప్రభుత్వం ఇటీవల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కొత్త చట్టం విబి జి రామ్ జి తెచ్చి పేదల నోట్లో మట్టి కొట్టాలనే ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టంగా కనపడుతున్నది. ఉపాది హామీ నిధుల్లో ఏపీకి భారీగా 40 వేల కోట్ల కోత పడుతున్నట్లు అర్థమవుతున్నదని . రాష్ట్ర ప్రయోజనాలపై రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం మాట అయినా కూడా మాట్లాడని పరిస్థితి నెలకొన్నదని నూతన చట్టాన్ని రద్దుచేసి యధావిధిగా పాత చట్టాన్ని కొనసాగించాలని బి కే ఎం యు జాతీయ సమితి పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం పీడీ సూర్యనారాయణ కి డిమాండ్స్ కూ డిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సభ్యులు ఆర్ సామేలు, పి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జూలై 1వ తేదీ నుండి రాష్ట్రంలో అమలు చేయాలని ప్రవేశపెట్టనున్న జి రాంజీ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యంగా మన కరువు ప్రాంతాలు, మెట్ట ప్రాంతాల్లోని లక్షలాది కుటుంబాలకు ఉపాధి హామీ ఒక కీలకమైన జీవనాధారమని 2014-2015 నుంచి 2025 - 2026 వరకు ఉపాధి హామీ పథకం కింద ఆంధ్రప్రదేశ్ కు కేంద్రం నుంచి సుమారు 77,400 కోట్లు వచ్చాయని అదే కాలంలో దేశవ్యాప్తంగా ఉపాధి హామీపై జరిగిన వ్యయంలో దాదాపు 8.8%, కానీ కేంద్రం కొత్తగా తీసుకువస్తున్న విబి జి రామ్ విధానం ప్రకారం నిధుల కేటాయింపు జరిగితే, ఆంధ్రప్రదేశ్ వాటా 8.8% నుంచి కేవలం 4.22 శాతానికి పడిపోయే ప్రమాదం ఉందని అన్నారు. అంటే అదే స్థాయి జాతీయ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఏపీకి రావలసిన నిధులు సుమారు 77,400 కోట్ల నుంచి 37 వేల కోట్లకు తగ్గుతుందని ఆంధ్రప్రదేశ్ కి దాదాపు 40,000 కోట్ల నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు. అది చిన్న సాంకేతిక మార్పు కాదు. ఇది ఆంధ్రప్రదేశ్ లోని 28 జిల్లాల్లో 688 మండలాల్లో 13,326 గ్రామపంచాయతీల్లో ఉన్న 26 వేల గ్రామాల్లోని ప్రజలు 66.45 లక్షల మంది జాబ్ కార్డులు జారీ చేయగా అందులో యాక్టివ్ గా ఉన్న జాబ్ కార్డులు 55 లక్షలు మాత్రమే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో దళితులు, గిరిజనులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పేద కుటుంబాలు వలసలు పెరిగే ప్రమాదం వుంది. గ్రామీణ ప్రాంతాలపై నేరుగా పెద్ద ఆర్థిక ప్రభావం చాలా తీవ్రంగా పడే అవకాశం ఉందని ఆవేదనతో అన్నారు. ఉపాధి హామీ పథకం సాధారణ సంక్షేమ పథకం కాదు. అది పేదల చట్టబద్ధమైన హక్కు. ఆంధ్రప్రదేశ్ కు రావలసిన వాటా తగ్గిపోతే దాని ప్రభావం నేరుగా గ్రామీణ కూలీల మీద, ముఖ్యంగా అట్టడుగు వర్గాలు దళితులు, గిరిజనులు, ఆర్థికంగా వెనకబడిన వర్గాలపై పడుతుందని ఇంత పెద్ద నష్టం రాష్ట్రంలో ఉపాధి కూలీలకు ఎదురవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం చాలా బాధాకరమని . రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై పనుబారం పడుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ని బిజి రామ్ చట్టాన్ని వ్యతిరేకించి అసెంబ్లీలో తీర్మానం చేయవలసి ఉండగా, ఇటీవల మంత్రి మండలి సమావేశంలో కొత్త చట్టాన్ని ఆమోదించడం వ్యవసాయ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి తెలియజేస్తున్నదని విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వం పై రాబోయే సంవత్సర కాలంలో ఆర్థిక పెనుభారంగా మారి ఉపాధి హామీకి నిధులు కేటాయించే పరిస్థితి ఉండకపోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ముందుగా తన వాటా 40 శాతం డబ్బులు కేటాయిస్తేనే, కేంద్ర ప్రభుత్వం 60% విదులు కేటాయిస్తుందని దీనివలన మన రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఇప్పటికైనా కొత్త చట్టం వలన రాష్ట్రానికి జరిగే ఆర్థిక ఎనుబారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బి కే ఎం యు జిల్లా సమితి డిమాండ్ చేస్తున్నదని తెలిపారు.

# సానుభూతి వద్దు... సమాన గౌరవం ముద్దు



పల్లె వెలుగు: భర్త మరణిస్తే భార్య నుదుటి బొట్టు పోతే ఏమి? ఆమె గుండెల్లోని అనుబంధం చనిపోదు కదా! చేతికున్న గాజులు పగిలిపోతే ఏమి? మనుషులపై మమకారం చెరిగిపోదు కదా! భర్తను కోల్పోవడం ఆమె తప్పు కాదు. అలాంటప్పుడు ఆమెను పాపాత్మురాలిగా చూడడం అన్యాయం. కట్టుకున్నవాడు కానరాని లోకాలకు వెళ్లిపోతే, కన్నవారే ఆమెను దూరం పెట్టడం ధర్మమా? పండుగలు వస్తే గదిలో దాచడం, శుభకార్యాలు జరిగితే ఆమె నీడను కూడా పడనీయకపోవడం, నలుగురిలోకి వస్తే అపశకునమంటూ నిందించడం ఎంతవరకు సమంజసం? సమాజం చూపులు ఆమెను నిలువునా దహించేస్తాయి. రంగురంగుల హైటెక్, కృత్రిమ మేధ (ఏఐ) యుగంలో కూడా ఆమెకు తెల్ల చీరే శిక్షగా మిగులుతుందా? నవ్వడం కూడా నేరంగా భావించే సామాజిక వాతావరణం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆమె కన్నీళ్లు ఎవరికీ శాపాలు కావు. కానీ సమాజం చూపించే వివక్ష ఆమెకు నిత్య గాయాలుగా మారుతోంది. ఆమె కూడా ఒక అమ్మే, ఒక కూతురే. మనలాగే రక్తమాంసాలు కలిగిన మనిషే. మనసున్న వ్యక్తే. అయితే ఆమె నవ్వులో ఎందుకంత వివక్ష? ఆమె ఒంటరితనానికి ఎందుకీ సామాజిక శిక్ష? ఆమె చదువుకుంది. సంపాదించగలదు. దేశాన్ని మార్చే శక్తి కూడా ఉంది. కానీ మూఢనమ్మకాలు, కట్టుబాట్ల మధ్య ఆమె జీవితం ప్రశ్నార్థకంగా మిగిలిపోతోంది. ఇకనైనా మారుదాం. సంకుచిత ఆలోచనలను వీడుదాం. పాతకాలపు మూఢసంకెళ్ల నుంచి ఆమెకు విముక్తి కల్పిద్దాం. ఆమె జీవితంలో మళ్లీ రంగులు నింపుదాం. కొత్త ఆశలతో ముందుకు నడిపిద్దాం. ఆమెకు స్వేచ్ఛ ఉంది. స్వేచ్ఛగా జీవించే హక్కు ఉంది. ఆమెకు కావలసింది సానుభూతి కాదు, సమాజంలో సమాన గౌరవం. ఆమెను కూడా మనలో ఒకరిగా ఆదరిద్దాం. మానవత్వంతో కొత్త లోకాన్ని నిర్మిద్దాం. వితంతువులకు సామాజిక గౌరవం, న్యాయం, విద్య, ఆర్థిక భద్రత కల్పించాలి. వారి ఆర్థిక స్వావలంబనకు సమాజం మద్దతు ఇవ్వాలి. దేశాభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దాలి. ఆమె నుదుట ధైర్యమనే బొట్టు పెట్టి ముందుకు సాగేలా ప్రోత్సహిద్దాం. వితంతువు అనేది శాపం కాదు; అది కేవలం ఒక పరిస్థితి మాత్రమే.లిలి బొట్టు, గాజులు, రంగు చీరలు మనిషి జీవితాన్ని శాసించలేవు. సాంప్రదాయాల పేరుతో ఒక మహిళను మానసికంగా చంపడం అమానుషం. సమాజం మారాలి. ప్రతి మహిళ ఆత్మగౌరవంతో జీవించే సమాన హక్కును పొందాలి. మార్పు మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి. -- నేదునూరి కనకయ్య రచయిత, కాలమిస్ట్, కరీంనగర్

# రైల్వే స్టేషన్ కు చక్రాల కుర్చీలు అందించిన లయన్స్ క్లబ్.

**చక్రాల కుర్చీల దాతలు ఆత్మకూరు సుదర్శనం శెట్టి, భవనాసి నాగ మహేష్.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఐక్యరాజ్యసమితి ప్రజాసేవ దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ కు ప్రయాణికుల సౌకర్యార్థం చక్రాల కుర్చీలు రెండు అందజేశారు.

నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, దాతలు నంద్యాల లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు ఆత్మకూరు సుదర్శనం శెట్టి, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు భవనాసి నాగ మహేష్ లు చక్రాల కుర్చీలు రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్ కు అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ నిరంతర సేవా కార్యక్రమాలను గత 56 సంవత్సరాలుగా చేస్తున్నదని భవిష్యత్తులో కూడా ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు.

ఆత్మకూరు సుదర్శనం శెట్టి, భవనాసి నాగ మహేష్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందజేస్తామని తెలిపారు.

రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులకు, వృద్ధులకు ఈ చక్రాల కుర్చీలు చాలా ఉపయోగపడతాయని అన్నారు. లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మాస్టర్ చంద్రశేఖర్, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు,లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మరియు రైల్వే క్రూ కంట్రోలర్ రవి ప్రకాష్, లోకో పైలట్ రామన్న, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, లయన్స్ క్లబ్ సభ్యులు ఎంపీవి రమణయ్య, లయన్స్ క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ యూసుఫ్,నూతన కార్యదర్శిగా ఎంపికైన మేడా చంద్రశేఖర్, పారిశ్రామికవేత్త ఆత్మకూరు రవి పాల్గొన్నారు.

# వైసీపీకి షాక్.. టీడీపీలోకి జంప్

ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 23 ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి సమక్షంలో వైసీపీకి చెందిన పెద్ద కౌలుట్లయ్య, చిన్న కౌలుట్లయ్య, పెద్ద కేశన్న, చిన్న కేశన్న కుటుంబాలకు చెందిన 50 మంది టీడీపీ కండువా కప్పుకున్నారు. కూటమి పథకాలకు ఆకర్షతులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారు పార్టీ బలోపేతంకు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి వారిని సాధారణంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కి భారీ గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, గ్రామ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# ఆదోని అభివృద్ధే ఎమ్మెల్యే పార్థసారథి లక్ష్యం.

బిజెపి నాయకులు మధుసూదన్శర్మ, నాగరాజ్ గౌడ్.



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి పనిచేస్తున్నారని బిజెపి సీనియర్ నాయకులు వెల్లాల మధుసూదన శర్మ, నాగరాజు గౌడ్ తెలిపారు. ఈరోజు విలేఖరుల సమావేశంలో శర్మ మరియు గౌడ్ మాట్లాడుతూ గత రెండు రోజులక్రితం 167నంబర్ నేషనల్ హైవే ఆర్ ఆర్ లేబర్ కాలనీ అప్రోచ్ రోడ్డు పక్కన ఉన్న ఆవుదూడ వంకలో ఖాళీ లారీ బోల్తాపడడం జరిగిందని శర్మ, గౌడ్ వివరించారు. పొరపాటున జరిగిన సంఘటనపైన వైఎస్సార్ పార్టీ అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని, ఇలా ప్రతి చిన్న విషయాన్ని రాజకీయం చేయాలని చూడడం వైఎస్సార్ పార్టీకి మంచిది కాదని హితవు పలికారు. నిరంతరం ప్రజలతో మమేకమై ఆదోని అభివృద్ధి కోసం కష్టపడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి పైన అనవసరమైన విమర్శలు చేస్తున్నారని బిజెపి నాయకులు దుయ్యబట్టారు. ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే పార్థసారథి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు విషయాలను తెలియచేయాలి కాబట్టి ఈ నాటి ఈ విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడమైనదని వివరించారు. ఆర్ ఆర్ లేబర్ కాలనీ అప్రోచ్ రోడ్డు కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు 23 లక్షలు ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి మంజూరు చేయించాలని, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అత్యంత తొందరగానే ఆవుదూడ వంక సైడుగోడ నిర్మించడం జరుగుతుందని బిజెపి నాయకులు మధుసూనశర్మ, నాగరాజు గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమములో బిజెపి పట్టణ అధ్యక్షులు మహదేవప్ప, తోవి నాగార్జున, సీనియర్ న్యాయవాది లోకేష్, ఉదుకుందప్ప, నాగరాజు, రవిప్రకాష్, రవికిరణ్, జాఫరన్నసుబ్రహ్మణ్యం, మొదలైన బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# చంద్రబాబు గో బ్యాక్.

**ఆదోనిని జిల్లాగా ప్రకటించలేని నారా చంద్రబాబు నాయుడు గో బ్యాక్.**

*బిఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనాపురం ఉదయ్.*

ఆదోని (పల్లె వెలుగు): అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రెస్ మీట్ ను ఉద్దేశించి డిజిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం ఉదయ్ రాష్ట్ర కార్యదర్శి బాలు మాట్లాడుతూ ఆదోని ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ అయిన ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలనే ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) విద్యార్థి సంఘంగా తెలియజేస్తున్నాము. ఆదోని ప్రాంత అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం, విద్యా మరియు ఉపాధి అవకాశాల పెంపు కోసం ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని డి ఎస్ ఎఫ్ పేర్కొంటోంది. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఆదోని ప్రాంతానికి అన్యాయం చేస్తున్న నారా చంద్రబాబు నాయుడు వెంటనే ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాము అన్నారు అలాగే కర్నూలు జిల్లా కేంద్రంలో విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాము. ఆదోని జిల్లాగా ప్రకటించాలి. ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత స్థలము కేటాయించి భవనం నిర్మాణం ఏర్పాటు చేయాలి. ఆరెకల్ సమీపంలో ఉన్నటువంటి మైనారిటీ వృద్ధు కళాశాల అడ్మిషన్లు ప్రారంభించాలి. ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో



నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. మా ప్రధాన డిమాండ్లను పరిష్కరించకపోతే రేపటి రోజున నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి డి ఎస్ ఎఫ్ విద్యార్థి సంఘంగా అడ్డుకుంటామని తెలియజేస్తున్నాము.

## వక్ఫ్ ఆస్తులను రక్షించడంలో మంత్రి ఫరూక్ విఫలమయ్యారు.

# వైసీపీ మైనారిటీ నేతల ధ్వజం.

**● ఈద్గాకు చెందిన 10 ఎకరాల స్థలాన్ని కోర్టు కాంప్లెక్స్‌కు ఎలా ఇస్తారు?: ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా. ● చాబోలు వద్ద 19 ఎకరాల వక్ఫ్ స్థలాన్ని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు ఇవ్వడాన్ని తప్పుపట్టిన వైసీపీ. ● వక్ఫ్ ఆస్తుల రక్షణ కోసం ముస్లింలంతా ఏకం కావాలని పిలుపు.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

నంద్యాల జిల్లాలో వక్ఫ్ బోర్డు స్థలాలను ప్రభుత్వ సంస్థలకు కేటాయింపు వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ముస్లిం మైనారిటీల పవిత్ర వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ సంస్థలకు కేటాయించడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వ చర్యలను దారుణంగా అభివర్ణించింది. అల్లా పేరిట ఉన్న స్థలాలను కోర్టు కాంప్లెక్స్, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ మైనారిటీ నేతలు నిప్పులు చెరిగారు. నంద్యాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వక్ఫ్ బోర్డు స్థలాలను ఇతర ప్రభుత్వ సంస్థలకు బదలాయించడంపై వైసీపీ మైనారిటీ విభాగం తిరుగుబాటు జెండా ఎగరేసింది. నంద్యాల స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా అధ్యక్షతన ముస్లిం మైనార్టీ నేతల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మా బున్నీ సా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, మైనార్టీ నాయకులు జి మాజీ సమాజానికి ద్రోహం చేయడమేనని మండిపడ్డారు."ఒక్కసారి అల్లాకు ఇచ్చిన స్థలాలను కేవలం ముస్లింల ప్రయోజనాల కోసం, దైవకార్యాల కోసమే ఉపయోగించాలి. వాటిని





మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సలముల్లా, గన్నీ కరీం,.ఎం గౌస్, నంద్యాల జిల్లా వైసీపీ జనరల్ సెక్రెటరీ దేవనగర్ బాషా తదితరులు అత్యవసర సమావేశంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇషాక్ బాషా వైసీపీ నేతలు మాట్లాడుతూ... కౌలూరు గ్రామం ఈద్గా కు చెందిన వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉన్న పది ఎకరాల స్థలాన్ని కోర్టు కాంప్లెక్స్ ల నిర్మాణానికి కేటాయించడాన్ని వైసీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న ఎన్.ఎమ్.డి. ఫరూక్.. వక్ఫ్ ఆస్తులను రక్షించాల్సింది పోయి, ఇలా కోర్టుల నిర్మాణానికి రాసివ్వడం ముస్లిం అమ్మడం, బదలాయించడం నిషిద్ధం. వక్ఫ్ ఆస్తులను కాపాడలేని మంత్రి ఫరూక్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. గత వైసీపీ ప్రభుత్వంలో మేము నూనెపల్లి జామియా మసీదు ఆస్తులను కాపాడాం. కానీ ఈ కూటమి ప్రభుత్వం చాబోలు గ్రామం వద్ద ఉన్న వక్ఫ్ బోర్డుకు చెందిన 19 ఎకరాల 14 సెంట్ల భూమిని పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు, ఆర్మ్డ్ ఫోర్సెస్ కు కేటాయించడం దారుణమని వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం నంద్యాల జిల్లాలోని ముస్లిం మైనార్టీలంతా సంఘటితం కావాలని, ఈ అన్యాయంపై ఎంతవరకైనా వెళ్లి పోరాడతామని వైసీపీ నేతలు హెచ్చరించారు. చట్టపరంగా, సామాజికంగా కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని వారు స్పష్టం చేశారు.

## ఆకాశంలో అద్భుతం.. సూర్యుడి చుట్టూ వలయం దర్శనం



హోళగుంద పల్లె వెలుగు జూన్ 23 మండలంలోని గజ్జహల్లి ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం ఆకాశంలో అరుదైన ప్రకృతి దృశ్యం కనిపించింది. సూర్యుడి చుట్టూ పెద్ద వలయం ఏర్పడి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ దృశ్యాన్ని గమనించిన ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో చిత్రాలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. వాతావరణ నిపుణుల ప్రకారం, ఎత్తైన మేఘాల్లో ఉండే మంచు స్ఫటికాల ద్వారా సూర్యకాంతి వక్రీభవించడం వల్ల ఈ వలయం ఏర్పడుతుంది. దీనిని "సన్ హాలో" అని పిలుస్తారు. ఇది ప్రకృతిలో అప్పుడప్పుడూ కనిపించే అరుదైన దృశ్యంగా పేర్కొంటున్నారు. సూర్యుడి చుట్టూ ఏర్పడిన ఈ ప్రకాశవంతమైన వలయం కొంతసేపు కనిపించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఆకాశంలో ఈ అద్భుత దృశ్యం కనిపించడం ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

## విలువిద్యలో రాణించాలి: నారాయణ

# స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ, ముఖ్యంగా విలువిద్య (ఆర్చరీ) లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నారాయణ సి.ఓ.



స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. ఒలింపిక్ డే - 2026 పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీన కర్నూలులోని రిడ్జ స్కూల్‌లో జిల్లా స్థాయి విలువిద్య పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో నారాయణ సి.ఓ. స్కూల్‌కు చెందిన తుంగని మమతా శ్రీ అద్భుత ప్రతిభ కనబరిచింది. అండర్-13 విభాగంలో తను అత్యుత్తమ ప్రదర్శనతో గోల్డ్ మెడల్ (ప్రథమ స్థానం) కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మమతా శ్రీ జిల్లా స్థాయిలో బంగారు పతకం సాధించడం పాఠశాలకే గర్వకారణమన్నారు. ఇదే పట్టుదలతో రాబోయే రోజుల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. మమతా శ్రీ సాధించిన ఈ విజయానికి అభినందనలు తెలియజేస్తూ.. ఆమె ప్రతిభను వెలికితీసి, ప్రోత్సహించిన పి.ఇ.టి టీచర్ మహేష్ యాదవ్, కోచ్‌లు నాగరత్నమయ్య, వంశీ గార్లతో పాటు విద్యార్థిని తల్లిదండ్రులను ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల తరఫున క్రీడాకారులకు ఎల్లప్పుడూ పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

*-మాధవరం సమీపంలో హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి*

ఆదోని (పల్లె వెలుగు): ముఖ్యమంత్రి పర్యటనకు సంబధించిన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. మంగళవారం మంత్రాలయం





మండలం మాధవరం గ్రామం సమీపంలో హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి గురువారం మంత్రాలయం లో పర్యటించే అవకాశం ఉన్నందున సంబంధించిన అన్ని ఏర్పాట్లు సమన్వయంతో, ఎటువంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణ పనులను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. అలాగే హెలిప్యాడ్ పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, రాకపోకల మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు, రవాణా శాఖ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ హెలిప్యాడ్ ప్రాంతం, సభా వేదిక స్థలం, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) మధుసూదన్ రెడ్డి, ఆర్. అండ్.బి ఎస్. ఈ మహేశ్వర రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, తహశీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ సూచీలలో అట్టడుగు స్థాయిలో భారత్ ఉండడం శోచనీయం.



గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కదిరి కోట రవికిరణ్ మాట్లాడుతూ ఒకవైపు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అచ్చేదిన్, వికసిత భారత్, సబ్కా వికాస్, స్వర్ణ భారత్ అంటూ ఉంటే మరొకవైపు దాదాపు అన్ని ప్రపంచ సూచీలలో భారతదేశం అట్టడుగు స్థాయిలో ఉండడం శోచనీయమని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కదిరి కోట రవికిరణ్ పేర్కొన్నారు ఇన్స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ సంస్థ 2026వ సంవత్సరానికి సంబంధించి 163 దేశాలలో ప్రపంచ శాంతి సూచికి అనగా గ్లోబల్ పీస్ ఇండెక్స్ కు సంబంధించి నివేదిక సమర్పించింది అందులో ఐస్లాండ్ మొదటి స్థానంలో న్యూజిలాండ్ రెండవ స్థానంలో, స్విట్జర్లాండ్ మూడవ స్థానంలో రాగా నేపాల్ 111వ స్థానంలో బంగ్లాదేశ్ 117 వ స్థానంలో రాగా భారతదేశం 127 వ స్థానంలో ఉండడం శోచనీయమని కదిరి కోట రవికిరణ్ అన్నారు తలసరి ఆదాయంలో 142వ స్థానంలో, ఆకలి సూచికలో 101 వ స్థానంలో, మానవాభివృద్ధి సూచికలో 130 వ స్థానంలో, సంతోష సూచికలో 144 స్థానంలో ఉన్నదని కదిరి కోట రవికిరణ్ వివరించారు ఇప్పటికైనా గొప్పలు చెప్పుకోవడం, సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడం మానుకోవాలని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కదిరి కోట రవికిరణ్ మోడీ ప్రభుత్వానికి సూచించారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ పథకాల కింద రాష్ట్రంలో 6400 కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కదిరి కోట రవికిరణ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# విద్యుత్ శాఖకు రూ.10 లక్షల నష్టం



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలోని గ్రామాల్లో సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి విద్యుత్ శాఖకు భారీగా నష్టం వాటిల్లింది. మండలంలోని ఆర్ఎస్ గాజుల పల్లె, శ్రీనగరం, నంది పల్లె, బొల్లవరం గ్రామాల్లో వృక్షాలు, చెట్టుకొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో 29 స్తంభాలు విరిగిపోగా, మూడు ట్రాన్స్ఫార్మర్లు దెబ్బ తిన్నాయని ఏఈ ప్రభాకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు రూ. 10 లక్షల మేర నష్టం వాటిలిందన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం.

### కొండ మాయ పల్లి గ్రామ సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డుపై పడ్డ గుంత.



రుద్రవరం. పల్లె వెలుగు : మండలంలోని రుద్రవరం కొండ మాయపల్లి గ్రామాల మధ్య ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డుపై గుంత ఏర్పడడంతో ప్రమాదం పొంచి ఉంది. గతంలో చిన్నకంబలూరు మెట్ట సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం దగ్గర ఇలాంటి గుంతే ఏర్పడడంతో మోటర్ సైకిల్ పై వెళుతున్న భార్యాభర్తలు గుంత దగ్గర మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రధాన రహదారి రుద్రవరం నుంచి సిరివెళ్ల మీదుగా నంద్యాలకు అలాగే మహాదేవపురం గ్రామాలకు వాహనాలు నిత్యం వెళుతూ ఉంటాయి. అలాగే మహానంది, అహోబిలం క్షేత్రాలకు కూడా ఈ రోడ్డు వెంటనే వెళ్తూ ఉంటారు. అందువల్ల వాహనదారులు ప్రమాదాలకు గురికాకముందే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గుంత పడిన చోట మరమ్మత్తులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు.



సిరివెళ్ల జూన్ 23 పల్లె వెలుగు జిల్లాలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిరివెళ్ల మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, మండల సమాఖ్య వెలుగు ఆఫీస్ మరియు కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆత్మహత్యల నివారణ అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ జీవితం అమూల్యమైనది ఆశయంతో ముందుకు సాగండి అని ఆత్మహత్య అన్నిటికి పరిష్కారం కాదని ఆత్మహత్య ఒక శాశ్వత పరిష్కారం కాదని ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని మీతో మేము ఉన్నామంటూ అవగాహన కల్పించడం జరిగింది. ఆళ్లగడ్డ సిడిపిఓ తేజేశ్వరి మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన సమస్యలు, బాల్య వివాహాల గురించి వాటి నుంచి వచ్చే అనర్థాల గురించి తల్లిదండ్రులకు విద్యార్థులకు వివరించడం జరిగింది. అలాగే స్త్రీ శిశు సంక్షేమ శాఖలో భాగమైన వన్ స్టాప్ సెంటర్ గురించి సెంటర్ సిబ్బంది శ్వేత మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, సైబర్ క్రైమ్ మరియు సామాజిక మాధ్యమాల ద్వారా ఎదురయ్యే సమస్యల గురించి తెలియజేయడమైనది. టోల్ ఫ్రీ నెంబర్స్ 14416 , 1098, 181 గురించి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి ఉమామహేశ్వరమ్మ , ఆళ్లగడ్డ సిడిపిఓ తేజేశ్వరి, సూపర్వైజర్లు లక్ష్మీదేవి, రాషిదా బేగం , వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది శ్వేత, వెలుగు ఏపీఎం రాజశేఖర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఆళ్లగడ్డ యూనిట్ లో పనిచేస్తున్న విజయ్ కిరణ్ అనారోగ్య సమస్యతో మృతి.

*జిల్లా ఎస్పీ ఆదేశాలతో సంబంధిత అధికారుల పరామర్శ.*

*అంత్యక్రియల నిమిత్తం 10, పదివేల రూపాయలు-కుటుంబానికి అందజేత.*





ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 23 పల్లె వెలుగు ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ విజయ్ కిరణ్ అనారోగ్య సమస్యల కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కే విజయ్ కిరణ్ హోంగార్డ్ ఆళ్లగడ్డ యూనిట్ నందు విధులు నిర్వహించేవాడు 2005లో హోంగార్డుగా పోలీస్ శాఖలో నియామకం జరిగింది ఇతనికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.జిల్లా ఎస్పీ ఆదేశాలతో సంబంధిత అధికారులు పదివేల రూపాయలు అంత్య క్రియల ఖర్చుల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. పోలీస్ శాఖ తరపున విజయ్ కిరణ్ కుటుంబానికి రావలసిన బెనిఫిట్స్ ను త్వరలో అందజేయడం జరుగుతుందని తెలిపారు. హోంగార్డు విజయ్ కిరణ్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ రూరల్ ఇన్స్పెక్టర్ రమణ , రిజర్వ్ ఇన్స్పెక్టర్ బాబు , సబ్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్, ఆళ్లగడ్డ యూనిట్ హోంగార్డు ఇన్చార్జి హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మూలన పడ్డ రా వాటర్

*బయటి నుండి నీళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు*



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 23: బండి ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాగునీటి కొరత ఏర్పడింది. దీనితో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు తాగునీటి కొరకు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో





2001 సంవత్సరంలో అదా నీ కంపెనీకి చెందిన కొందరు అధికారులతో బండి ఆత్మకూరు కు చెందిన కీర్తిశేషులు ఇటిక్యాల వెంకట సుధాకర్ రెడ్డి ప్లాంటును ఏర్పాటు చేసేలా కృషి చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల నుండి రా ప్లాంట్ మూలన పడింది. మరమ్మతులు చేయించడంలో కళాశాల యాజమాన్యం విఫలమయ్యింది. వేసవి సెలవులు అనంతరం జూన్ 6వ తేదీ నుండి కళాశాల పునః ప్రారంభమైంది. కళాశాల ప్రారంభమైన నాటి నుండి నీటి పరిస్థితి అలాగే ఉంది. కళాశాల విద్యార్థులు నీటి కోసం బయటకు వెళ్లి నీళ్లను తెచ్చుకొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. మంగళవారం కొంతమంది విద్యార్థులు బయటినుండి బబుల్ క్యాన్లతో నీళ్లను మూసుకొని రావడం ఎందుకు సాక్షి భూతంగా నిలుస్తూ ఉంది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివిన కొందరు విద్యార్థులు ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ల కొరకు కళాశాలకు వచ్చే, కళాశాల యాజమాన్యం నీళ్ల తీసుకొని రమ్మని విద్యార్థులను పురమాయించారు. విద్యార్థులు గత్యంతరం లేక బయట బయటినుండి వాటర్ క్యాన్లు తీసుకొని తెచ్చి కళాశాలలో చేరవేశారు. తర్వాత వారికి టిసి సర్టిఫికెట్ ఇచ్చి పంపించి వేశారు. కళాశాలలో రావాటరు మరమ్మతులకు సంబంధించిన విషయంతో పాటు, నీటి సమస్య గురించి కళాశాల ప్రిన్సిపాల్ ను ప్రశ్నిస్తే వేరే విధంగా సమాధానం ఇచ్చారు. కళాశాలలో తాగునీటి ఎద్దడి ఉందని ఎవరు చెప్పారు? మా వాళ్లే చెప్పి ఉంటారు అంటూ ఆరోపణలు చేశారు. కళాశాలలో తాగునీటి ఎద్దడి ఉంది. రా వాటర్ ను మరమ్మత్తులు చేయిస్తామని చెప్పాల్సిన ప్రిన్సిపల్, తోటి సిబ్బందిపై నిందలు వేయడంలో ప్రిన్సిపల్ ఆంతర్యం ఏమిటో అంతు పట్టడం లేదు. కళాశాలలో తాగునీటి ఎద్దడిని పరిష్కరించడంలో జిల్లా అధికారులు చొరవ తీసుకోవాలని కళాశాల విద్యార్థులు విజ్ఞప్తి చేస్తూ ఉన్నారు.

# రసాయనిక ఎరువులను భూసార పరీక్షల ఆధారంగా వాడాలి

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక గడివేముల



మండలం కొర్రపోలూరు గ్రామంలో "ఖేత్ బచావో అభియాన్ " కార్యక్రమం నిర్వహించడం జరిగినది. రసాయనిక ఎరువులను భూసార పరీక్షల ఆధారంగా,సిఫార్సు చేసిన మోతాదుల్లో మాత్రమే వాడాలని శాస్త్రవేత్తలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో మొక్కజొన్న, జొన్న,వరి గడ్డి మరియు ఇతర వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయడం వల్ల భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు. అందువల్ల వ్యవసాయ వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం ద్వారా అవి సేంద్రియ ఎరువులుగా మారి భూసారాన్ని పెంచుతాయని వివరించారు. రసాయనిక ఎరువులను భూసార పరీక్షల ఆధారంగా, సిఫార్సు చేసిన మోతాదుల్లో మాత్రమే వాడాలని సూచించారు. విచక్షణారహితంగా ఎరువులు వినియోగించడం వల్ల భూమి సారవంతం తగ్గి, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించడం కష్టమవుతుందన్నారు. రైతులకు మట్టి నమూనాలు సేకరించే సరైన విధానాన్ని వివరించారు. అలాగే భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలియజేశారు. భూమిలో కర్బన శాతాన్ని పెంచడానికి పచ్చి రొట్ట ఎరువులు అయిన జీలుగ, పిల్లిపేసర విత్తనం ప్రధాన పంట ముందు వేసుకోవాలి. కౌలు రైతులు తప్పకుండా కౌలు రైతు కార్డులు తీసుకోవాలి అప్పుడే వారికి ప్రభుత్వ పథకాలు అందుతాయిఅని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పి.కవిత , ప్రధాన శాస్త్రవేత్త సతీష్ బాబు, శాస్త్రవేత్త ఉమామహేశ్వరీ, బి టి యం, జి. కే. పవన్ కుమార్, ,మండల వ్యవసాయ అధికారి, హర్ష వర్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించి గుడిసే ఆది కృష్ణమ్మ.

ఆదోని (పల్లె వెలుగు): ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు నాయుడు జొన్నగిరి పర్యటన ఏర్పాట్లను విస్తృతంగా పరిశీలించిన కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ జోనల్-5 కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ బాబు, పత్తికొండ పరిశీలకులు పోలన్న, మరియు అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 24న జొన్నగిరిలో నిర్వహించనున్న పర్యటన, బహిరంగ సభను ఘనవిజయవంతం చేసేందుకు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ విస్తృతంగా ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతం, వేదిక నిర్మాణం, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, వైద్య



సదుపాయాలు, భద్రతా చర్యలు, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు, పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జొన్నగిరిలో భారీ సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు తరలిరానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఆమె సూచించారు. సభా ప్రాంగణంలో క్రమశిక్షణతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని, జొన్నగిరి పర్యటన రాయలసీమ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని అన్నారు. జియో గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను చారిత్రాత్మక విజయంగా నిలిపేందుకు పార్టీ నాయకులు, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక పురోగతికి జొన్నగిరి పర్యటన ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొని ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. రేపు జరగనున్న ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

# ఆదోని నియోజకవర్గ ప్రజల నమ్మకం మీనాక్షి నాయుడు

### గత రెండేళ్లలో 948 మందికి 2,46,72,495/- విలువైన సీ ఎం ఆర్ ఎఫ్ సహాయం.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, ఈరోజు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా 36 మందికి గాను మంజూరైన రూ. 15,80,027/- విలువైన చెక్కులను టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత రెండేళ్ల కాలంలో ఆదోని నియోజకవర్గ పరిధిలోని 948 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 2,46,72,495/- ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ సహాయం అందించడంలో ఆదోని నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సహకరించారని పేర్కొన్నారు. ఆరోగ్య చికిత్సలు, అత్యవసర వైద్య అవసరాలు, ప్రమాదాలు మరియు ఇతర సంక్షేమ కార్యక్రమాల కోసం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందిన ఈ ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిచ్చిందని తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందనడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందేలా కృషి చేస్తామని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉమాపతి నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు జిందె శంకర్, రామస్వామి, పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, అయ్యన్న, వెంకటేష్, రంగన్న, లక్ష్మీనారాయణ, గనేకల్ విరుపాక్షి, ఐ సి రామకృష్ణ, కరన్న, జయరాం, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ ఆచారి, సుబ్బారెడ్డి, వీరేష్, పీరా, సదుల్లా, రవి, వలి, ఈరన్న, తదితరులు పాల్గొనడం జరిగింది.



# రాయలసీమలో 'పసిడి' పంట



## :జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

**● దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ● రూ.405 కోట్ల పెట్టుబడితో జియో మైసూర్, డెక్కన్ గోల్డ్ మైన్స్ ఏర్పాటు ● రాష్ట్ర ఖజానాకు 4% రాయల్టీ ఆదాయం; 700 మందికి ఉపాధి ● నేడే ప్లాంట్ ప్రారంభోత్సవం, రెండో యూనిట్‌కు శంకుస్థాపన**

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

ఒకప్పుడు కరవు కేకలతో అలమటించిన రాయలసీమ గడ్డ.. ఇకపై పసిడి కాంతులతో మెరిసిపోనుంది. బంగారు నిక్షేపాల గని అనగానే గుర్తొచ్చే కర్ణాటక 'కేజీఎఫ్' (కోలార్ గోల్డ్ ఫీల్డ్స్) సరసన ఇకపై కర్నూలు జిల్లాలోని 'జొన్నగిరి' నిలవబోతోంది. దేశంలోనే ప్రైవేట్ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అతిపెద్ద గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ప్రారంభానికి సర్వసిద్ధమైంది. బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ ప్రాజెక్టు అధికారికంగా ప్రారంభం కానుంది. విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కూ ఆయన శంకుస్థాపన చేయనున్నారు.

**రూ.405 కోట్ల పెట్టుబడి.. 1,500 ఎకరాల విస్తీర్ణం**

జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా రూ.405 కోట్ల భారీ పెట్టుబడితో ఈ బంగారు నిక్షేపాల వెలికితీత కర్మాగారాన్ని నెలకొల్పాయి. ఈ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం మొత్తం 1,500 ఎకరాల భూమిని కేటాయించగా.. మొదటి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు జరిపేందుకు అవసరమైన ప్రాసెసింగ్ ప్లాంట్లు ఇప్పటికే సిద్ధమయ్యాయి. మైనింగ్‌కు సంబంధించిన ట్రయల్ రన్స్ సైతం విజయవంతంగా పూర్తయ్యాయి. ప్లాంట్ అవసరాల కోసం హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా 18 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మించి, 0.021 టీఎంసీల నీటిని వినియోగించనున్నారు.

**దశలవారీగా పసిడి ఉత్పత్తి.. ప్రభుత్వానికి భారీ రాయల్టీ**



ఈ ప్లాంట్ ద్వారా తొలి ఏడాది 400 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే ఏడాది దీనిని 900 కిలోలకు, ఆ తర్వాతి కాలంలో ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచి ఏడాదికి ఏకంగా 2 టన్నుల వరకు బంగారాన్ని వెలికితీయనున్నారు.

ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా 700 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అంతేకాకుండా, ఉత్పత్తి అయ్యే బంగారం మార్కెట్ విలువలో 4 శాతం రాయల్టీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు చేరనుంది. దీని ద్వారా తొలి ఏడాది (400 కేజీలకు) రూ.57 కోట్లు, మరుసటి ఏడాది (900 కేజీలకు) రూ.144 కోట్ల చొప్పున ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరనుంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు: బుధవారం కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన షెడ్యూల్ ఇలా ఉంది:

**ఉదయం 10.00 గంటలకు: అమరావతి నుంచి బయలుదేరుతారు.**

ఉదయం 11.30 గంటలకు: జొన్నగిరి మైనింగ్ ప్రాంతానికి చేరుకుంటారు.

ఉదయం 11.45 గంటలకు: గోల్డ్ మైనింగ్ మొదటి యూనిట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం జియో మైసూర్ ప్లాంట్ రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేస్తారు.

మధ్యాహ్నం 12.20 గంటలకు: జొన్నగిరిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

మధ్యాహ్నం 03.00 గంటలకు: పత్తికొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై స్థానిక రాజకీయాలపై చర్చిస్తారు.

# విలువిద్య, త్రోబాల్ విభాగాల్లో రాణించాలి: నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి

**● జిల్లా స్థాయి పోటీల్లో నారాయణ సీవో స్కూల్ విద్యార్థుల ఘన విజయం ● విలువిద్యలో తుంగని మమతా శ్రీకి గోల్డ్ మెడల్ ● త్రోబాల్‌లో బాలురకు ప్రథమ, బాలికలకు ద్వితీయ స్థానం**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని నారాయణ సీవో స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఒలింపిక్ డే-2026 పురస్కరించుకొని ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో నారాయణ సీవో స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో ఘన విజయం సాధించారు. ఈ నెల 18వ తేదీన స్థానిక రిడ్జ్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విలువిద్య (ఆర్చరీ), త్రోబాల్ పోటీల్లో నారాయణ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. విలువిద్య విభాగంలో పాఠశాలకు చెందిన తుంగని మమతా శ్రీ అమోఘమైన ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంతో పాటు గోల్డ్ మెడల్ (స్వర్ణ పతకం) కైవసం చేసుకుంది. అదేవిధంగా త్రోబాల్ విభాగంలో నారాయణ స్కూల్ బాలుర జట్టు ప్రథమ స్థానం (విజేత)గా నిలవగా, బాలికల జట్టు ద్వితీయ స్థానాన్ని (రన్నరప్) సొంతం చేసుకుంది.

**విజేతలకు అభినందనల మందారాలు**

జిల్లా స్థాయిలో పాఠశాల పేరును నిలబెట్టిన విజేతలను మంగళవారం స్కూల్ ఆవరణలో ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన పీఈటీ (వ్యాయామ ఉపాధ్యాయులు) మహేష్ యాదవ్‌ను ఆయన అభినందించారు. తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నిజాయితీ చాటుకున్న ఉద్యోగులు

మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్య క్షేత్రంలో



స్వామి అమ్మవార్ల దైవదర్శనార్థం నిజామాబాద్ ఆర్మూర్ పట్టణానికి చెందిన దాసరి రాధ అనే భక్తురాలు వచ్చారు. మంగళవారం గర్భాలయం సమీపాన దక్షిణామూర్తి స్వామి వద్ద తమ హ్యాండ్ బ్యాగ్ను మర్చిపోయారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఆ బ్యాగ్ లో తెరిచి చూడగా, అందులో రూ. 80,400 వేల నగదు, ఇతర వస్తువులు ఉన్న విషయాన్ని గుర్తించారు. ఆలయ అధికారులకు సమాచారం అందజేశారు. వెంటనే మైకు ద్వారా ప్రచారం చేసి ఆలయ పర్యవేక్షకులు సుబ్బారెడ్డి చేతుల మీదుగా భక్తురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగుల నిజాయితీకి కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యాభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

**● చంద్రపల్లెలో ఘనంగా ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ ● రూ. 30 వేల విలువైన పుస్తకాలు అందజేసిన ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్**

పల్లె వెలుగు -?ప్యాపలి విద్యాభివృద్ధికి తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం చంద్రపల్లె ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్ అధ్యక్షతన ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కీర్తిశేషులు నడిపి కుళ్ళాయప్ప, లక్ష్మీదేవి జ్ఞాపకార్థం వారి కుమారులు నాగేశ్వర యాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్ స్వంత ఖర్చులతో పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు సుమారు రూ. 30 వేల విలువచేసే నాణ్యమైన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. లతీఫ్ లాంటి హెచ్‌ఎం రావడం పాఠశాల అదృష్టం: డీసీఎంఎస్ చైర్మన్ ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి, పాఠశాల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. చంద్రపల్లె పాఠశాలకు అబ్దుల్ లతీఫ్ లాంటి నిబద్ధత గల ప్రధానోపాధ్యాయుడు రావడం ఈ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు చేసుకున్న అదృష్టమని కొనియాడారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా అని అక్కడికి వచ్చిన తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు 15న ఉచిత డ్రెస్సులు.. వాటర్ ప్లాంట్ బాధ్యత నాదే: టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాబోయే ఆగస్టు 15న పాఠశాల పిల్లలందరికీ ఉచితంగా డ్రెస్సులు అందజేస్తామని, అలాగే మంచి మార్కులు సాధించిన వారికి బహుమతులు ఇస్తామని ప్రకటించారు. పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థికి ప్రత్యేక బహుమతి అందిస్తామన్నారు. పాఠశాలలో







మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని హెచ్‌ఎం లతీఫ్ తన దృష్టికి తీసుకువచ్చారని, దానికి అయ్యే పూర్తి మరమ్మతు ఖర్చులను తానే భరిస్తానన్నారు. పాఠశాల నూతన ఒరవడి.. ప్రైవేటు నుండి ప్రభుత్వ బడికి.. గత ఏడాది జూన్ 9న తాను బాధ్యతలు చేపట్టానని ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్ తెలిపారు. నాడు గ్రామంలో తిరిగి తల్లిదండ్రులకు ఇచ్చిన మాట ప్రకారం నేడు పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఈ మార్పును చూసే ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలల నుండి 15 మంది విద్యార్థులు తమ బడిలో చేరారని, భవిష్యత్తులో విద్యార్థులను మరింత గొప్పగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేసారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. అడగడమే తడవుగా స్పందించి పాఠశాలకు అండగా నిలిచిన నాగేశ్వర యాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్ అన్నదమ్ములను పాఠశాల యాజమాన్యం, గ్రామస్తుల తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ చైర్మన్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీ లించిన కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్.



పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. ఈ నెల 25న మంత్రాలయం మం డలం మాధవరం గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి



నారా చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న నేప థ్యంలో భద్రతా ఏర్పాట్లను కర్నూ లు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, నంద్యాల ఎస్పీ సునీల్ షోరాణ్ పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్య టన సందర్భంగా ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని, అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయా లని సూచించారు. ఈ కార్యక్ర మంలో అధికారులు, ప్రజాప్రతి నిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణ

**ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి,**



నందవరం పల్లె వెలుగు జూన్ 23 నందవరం మండలంలో కనకవీడు గ్రామంలో హరిజన గందలం పెద్ద దేవదాస్ గత కొన్ని రోజుల క్రితం గుండె పోటు వలన మరణించడం ఈయన కు టీడీపీ పార్టీ సభ్యత్వం క్రింద సీఎం రిలీఫ్ ఫండ్ 42000 రూపాయలు చెక్ పంపిణీ చేశారు ఎమ్మెల్యే బీవీ జయనా గేశ్వర రెడ్డి మాట్లాడుతూ పేద వాడి సహాయం చేయాలన పేద వాడికి సంక్షేమ పథకలు అందించాలన కేవలం టీడీపీ పార్టీ తో నే సాధ్యం అని చెప్పడం జరిగింది. ఒక చంద్రన్న బీమా పథకం ద్వారా కేవలం కనకవీడు గ్రామం లో నే 4000000 లక్షల రూపాయలు గతం లో కనకవీడు గ్రామం లో రావడం జరిగింది. అని టీడీపీ పార్టీ కనకవీడు గ్రామ అధ్యక్షులు డబ్బా ఈరన్న చెప్పారు ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు ఖాసిం వలి, రైస్ మిల్ నారాయణరెడ్డి , డీలర్ దుబ్బన్న , దేవదాస్ ,పాల్గొన్నారు

# మాజీ ఎమ్మెల్యే ను మంత్రులను

**స్వాగతం స్వాగతం పలికారు ,,,,**
**జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ప్రదీప్ రెడ్డి.**







ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 23 కర్నూలు జిల్లాలో కౌతాళం మండలం బదినేహాల్ పర్యటనలో భాగంగా ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయానికి విచ్చేసిన మాజీ మంత్రి మేరుగ నాగార్జున , మాజీ ఎమ్మెల్యే టి.సుధాకర్ బాబు , ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ముారి కనక రావు కి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి శాలువ కప్పి బొకే అందజేసి సన్మానించిన అనంతరం పలు రాజకీయ విషయాల పై చర్చించారు ఈ కార్యక్రమంలో పురుషోత్తం రెడ్డి వైఎస్ఆర్ నాయకులు పాల్గొన్నారు

# శంషాబాద్ సుల్తాన్పల్లి వాగు భారీ వర్షం కారణంగా అవతలికి ఇవతలికి రాకపోకలు ఆపేశారు



రంగారెడ్డి శంషాబాద్ ( పల్లె వెలుగు ప్రతినిధి:) నిన్న అనగా తేదీ: 23.06.2026 నాడు రాత్రి కురిసిన వర్షానికి గాను సుల్తాన్ పల్లి గ్రామ పరిధిలోని ఈ.సి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సుల్తాన్ పల్లి నుండి మొయినాబాద్ కు వెళ్ళు మార్గం మొత్తం నీటిలో మునిగిపోయినది. ఈరోజు అనగా తేదీ: 23.06.2026 నాడు కమీషనర్ . తరుణ్ జోషి ×ూా , చేవెళ్ల జోన్ ఐజూ . యోగేష్ గౌతమ్ ×ూా , శంషాబాద్ూా ాఽూ . ఖ. నరేందర్ రెడ్డీ ఇన్స్పెక్టర్ , సెక్టార్ ా× . సైద్ సదట్ అలీ మరియు శంషాబాద్ పోలీసు సిబ్బంది అందరూ కూడా సుల్తాన్ పల్లి వాగు ను సందర్శించినారు మరియు అట్టి వాగు దగ్గరికి ప్రజలను వెళ్లనివ్వకుండా అడ్డుగా బారికేడ్లు పెట్టినారు. తర్వాత ఎకమీషనర్ . తరుణ్ జోషి గ్రామస్తులను ఉద్దేశించి రైని సీజన్ ఉండడంతో గ్రామస్తులు లోతట్టు ప్రాంతాలకు, కరెంట్ పోల్స్ కి దూరంగా ఉండాలని సూచనలు ఇచ్చారు. మరియు పాత బడి ఉన్న ఇండ్లను వదిలి సురక్షితమైన ప్రాంతానికి వెళ్ళాలి అని, చిన్న పిల్లలను కరెంట్ పోల్స్ దగ్గరికి వెళ్లనివ్వకుండా చూసుకోవాలని, ఏదైనా ఎమర్జెన్సీ ఉంటే వెంటనే ఐఖుశ్రీ 112 కి కాల్ చేయాలని సూచించారు. కే నరేందర్ రెడ్డి ఇన్స్పెక్టర్ శంషాబాద్

# రక్త మార్పిడి సేవల్లో జాతీయ గుర్తింపు: కర్నూలు

# జీజీహెచ్ రక్తకేంద్రానికి 'చీదీుజ' అవార్డు

**● రాష్ట్రంలోనే అత్యధికంగా 13,546 స్వచ్ఛంద రక్తదానాల సేకరణ ● గుజరాత్‌లో ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్న బ్లడ్ బ్యాంక్ బృందం ● సిబ్బంది, దాతల సహకారంతోనే ఈ ఘనత: సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) రక్తకేంద్రం జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. రక్త మార్పిడి సేవల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను జాతీయ రక్త మార్పిడి మండలి (చీదీుజ) కర్నూలు జీజీహెచ్‌కు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డును ప్రకటించింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల (జూన్ 16న) గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో ఈ పురస్కారాన్ని ఘనంగా ప్రదానం చేశారు.

రికార్డు స్థాయిలో రక్త సేకరణ.. రాష్ట్రంలోనే ప్రథమ స్థానం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అత్యధికంగా 42 స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను నిర్వహించడంతో పాటు, రికార్డు స్థాయిలో 13,546 యూనిట్ల స్వచ్ఛంద రక్తదానాలను సేకరించి కర్నూలు బ్లడ్ బ్యాంక్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. రోగుల ప్రాణాలు కాపాడటంలో చూపిన నిరంతర కృషి, పారదర్శక సేవలను గుర్తిస్తూ జాతీయ రక్త మార్పిడి మండలి ఈ విశిష్ట విజయానికి గాను జాతీయ అవార్డుతో సత్కరించింది. ఆసుపత్రికి ఎంతో గర్వకారణం: సూపరింటెండెంట్

జీజీహెచ్ రక్తకేంద్రానికి జాతీయ అవార్డు రావడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ఈ పురస్కారం లభించడం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి ఎంతో గర్వకారణమన్నారు. రక్తకేంద్రం వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బంది అంకితభావం, స్వచ్ఛంద రక్తదాతలు, వివిధ సేవా సంస్థలు మరియు ప్రజల నిరంతర సహకారంతోనే ఈ అరుదైన ఘనత సాధ్యమైందని ఆయన కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

అవార్డు గ్రహీతల అభినందన సభ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు సాధించిన బ్లడ్ బ్యాంక్ బృందాన్ని ఆసుపత్రి వర్గాలు ప్రత్యేకంగా అభినందించాయి. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జ్ ప్రొఫెసర్, హెచ్‌ఓడీ డాక్టర్ జి. బాలేశ్వరి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. సునీత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ షేక్ షహనాజ్, డాక్టర్ సి. రవికాంత్ (ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్), కౌన్సిలర్ కిరణ్, ల్యాబ్ టెక్నీషియన్ జగదీశ్వర్ రెడ్డి, స్టాఫ్ నర్సులు గేరా సుజాత, ఇందిరా విశ్వాసమ్మ తదితరులు పాల్గొని సంతోషాన్ని పంచుకున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత.

**☛ కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్.**
**☛ 1200 మంది పోలీసులతో బందోబస్తు.**
**☛ పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి.**





పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24వ తేదీన పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరిలో ఉన్న జియో మైసూర్ గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్,సభా ప్రాంగణం తదితర ప్రాంతాల్లో జిల్లా ఎస్పీవిక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేశా రు.బందోబస్తు విధుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధి కారులు, సిబ్బందికి మంగళవారం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పగిడిరాయి గ్రామంలో గోల్డ్ మైన్స్ సమీపంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. 1,200 మంది పోలీసు సిబ్బందిని భద్రతా విధుల్లో నియమించారు. వీరిలో ముగ్గురు అడిషనల్ ఎస్పీ లు,14 మంది డీఎ స్పీలు, 40 మం ది సీఐలు, 76 మంది ఎస్సైలు, 300 మంది ఏఆర్, ఏపీఎస్పీ మరి యు స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బం ది పాల్గొంటున్నారు.విధుల్లో ఉన్న అధి కారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవ హరించి ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలకు తావులేకుండా విధులు నిర్వ హించాలని ఎస్పీ ఆదేశించారు. భద్రతా చర్యలను సమన్వయంతో ముఖ్య మంత్రి పర్యటనను విజయ వంతం చేయాలని సూచించారు.ఈ కార్య క్రమంలో కర్నూలు అడి షనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా , కడప అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు , నంద్యాల అడిషనల్ ఎస్పీ చిన్ని కృష్ణ , సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

-బిజెపి నాయకులు నివాళులర్పించారు







నందవరం పల్లె వెలుగు జూన్ 23 ఎమ్మిగనూరు నియోజకవర్గం లో నందవరంలోని బిజెపి కార్యాలయంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బిజెపి నాయకులు ఘన నివాళులు అర్పించారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రముఖ విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఈ ం జు నందవరంలోని బిజెపి కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి గురురాజ్ దేశాయ్ అ ధ్యక్ష్యం లో నాయకులతో కలిసి డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గురురాజ్ దేశాయ్ మాట్లాడుతూ దేశ సమైక్యత, జాతీయత కోసం డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను వ్యతిరేకిస్తూ "ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండరాదు" అనే సిద్ధాంతంతో ఆయన పోరాటం చేశారని గుర్తుచేశారు. దేశ ఐక్యత, అఖండత కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధి, జాతీయ సమైక్యత కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు బి యల్ నారాయణ , పట్టణ ఉపాధ్యక్షులు గాజుల సురేంద్ర, నందవరం మండలం మాజీ సర్పంచ్ రామన్న గౌడ్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు మాధవి లత , జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పద్మావతి ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కళ్యాల్ శివ, నందవరం బిజెపి సీనియర్ నాయకులు టీవి మెకానిక్ శ్రీనివాసులు, నాగలదిన్నె బిజెపి నాయకులు దస్తగిరి, దానియల్, బిజెపి నాయకులు గురజాల హనుమంతు, ఎ.ఎ కాలనీ పాటశాల చైర్మన్ శివ, ఎమ్మిగనూరు పట్టణ నాయకులు మల్లికార్జున, నందవరం 34 బూత్ కన్వీనర్ చెంచు మల్లేష్, బిజెపి మైనార్టీ నాయకులు సుభాన్, అబ్దుల్లా, రజక సంఘం నాయకులు చాకలి ఉరుకుందు, చాకలి పెద్దయ్య, గని, మినల్లా, సోషల్ మీడియా కన్వీనర్ దండు వీరేష్ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని డాక్టర్ శ్యాంప్రసాద్ ముకర్జీ కి నివాళులు అర్పించారు.

# దశాబ్దాల సమస్యలకు చరమగీతం !

# పిటిషన్ల కమిటీ ముందు గళమెత్తిన ఎమ్మెల్యే పల్లా

విశాఖపట్నం, జూన్ 23(పల్లె వెలుగు దినపత్రిక) విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో





శాసనసభ పిటిషన్స్ కమిటీ ఛైర్మన్ కనుమూరు రఘురామకృష్ణం రాజు అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. గాజువాక నియోజకవర్గం లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 14 ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. కుంచమాంబ కాలనీ, సిద్ధార్థనగర్ వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉంటున్న వారికి రిజిస్ట్రేషన్లు, పట్టాల కోసం ప్రత్యేక విధానం తేవాలని కోరారు. దీనిపై 90 రోజుల్లో చర్యలు తీసుకోవాలని కమిటీ అధికారులను ఆదేశించింది. నివాసిత ప్రాంతాలను 22-ఏ జాబితా నుంచి తొలగించాలని కోరగా, దీనిపై నివేదిక ఇవ్వాలని కమిటీ సూచించింది. ఫార్మాసిటీ, ఉక్కు పరిశ్రమ నిర్వాసితుల పునరావాసం, నకిలీ ఆర్-కార్డుల సమస్యలపై కమిటీ సానుకూలంగా స్పందించింది. 486 అనుమానాస్పద కార్డుల పరిశీలనకు హామీ ఇచ్చింది. మూతపడిన యూనిట్లను రద్దు చేసి, కొత్త పరిశ్రమలకు కేటాయించాలని కోరగా, 90 రోజుల్లో సమగ్ర నివేదిక కోరింది. 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైతులకు పరిహారంపై 6 నెలల్లో ఆడిట్ పూర్తి చేయాలని ఆదేశించింది. గాజువాక ప్రజల దశాబ్దాల కష్టాలను పిటిషన్స్ కమిటీ ముందు ఉంచాను. 22-ఏ సమస్యల నుంచి, నిర్వాసితుల పునరావాసం వరకు ప్రతి అంశంపై కమిటీ సానుకూలంగా స్పందించింది. నిర్ణీత గడువులోగా ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయనే నమ్మకం ఉంది అని పల్లా శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే అన్నారు ఈ సమావేశంలో ఎమ్మెల్యేలతో పాటుఉన్నతాధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎంతో కాలంగా వేధిస్తున్న సమస్యలు ఇప్పుడు పిటిషన్స్ కమిటీ పరిధిలోకి రావడంతో బాధితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి

## రికార్డ్ స్థాయి ప్రవేశాలను చేపట్టిన ఉపాధ్యాయులను

## అభినందించిన విద్యాశాఖాధికారి

అనకాపల్లి, జూన్ 23 (పల్లె వెలుగు దినపత్రిక) మామిడిపాలెం జిల్లా పరిషత్



ఉన్నత పాఠశాలను సందర్శించిన అనకాపల్లి జిల్లా డిఇఓ గిడ్డి అప్పారావు నాయుడు పాఠశాల లో రికార్డు స్థాయి ప్రవేశాలు నమోదు అవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నేటికి 135 మంది జాయిన్ అవ్వడం, వారిలో 57 మంది ప్రయివేట్ విద్యా సంస్థల నుంచి వచ్చిన విద్యార్థులు ఉండడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు మరియు వారందరికీ చాక్లెట్లు పంచి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ మామిడిపాలెం ఉపాధ్యాయులు మరింత ఉత్సాహం తో పనిచేసి, చేరిన విద్యార్థులకు విద్యకు గారంటీ ఇవ్వాలన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాఠశాలలో చేరడానికి కృషి చేసిన ఉపాధ్యాయులందరినీ అభినందించారు. అలాగే ఇదే పాఠశాలలో ఊధ్యాయుడు గా పనిచేస్తూ, తన ఇద్దరు సొంత పిల్లలను 9 వ తరగతి లోను మరియు 7 వ తరగతి లోను జాయిన్ చేసిన బి. వరప్రసాద్ ని పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేసారు.

## రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో

## మలేరియాపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం, జూన్ 23 (పల్లె వెలుగు, దినపత్రిక) :- స్థానిక ప్రభుత్వ



వైద్య కళాశాలలో మలేరియా అవగాహన మాసోత్సవం సందర్భంగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో మలేరియా, ఇతర వాహకజనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, అదనపు వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ ఎం.ఎస్. రాజు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు ప్రజల్లో ఆరోగ్య చైతన్యం కల్పించే రాయబారులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వి.వి. దుర్గాప్రసాద్ ప్రారంభోపన్యాసం చేస్తూ వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్స అందించడం ద్వారానే మలేరియాను నిర్మూలించగలమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ బి. శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. డాక్టర్ ఎం.ఎస్. రాజు డెంగ్యూ, చికున్‌గున్యా వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శివ ప్రసాద్ డ్రై డే ఆవశ్యకతను తెలియజేశారు. డాక్టర్ వి. సూర్యారావు ఇతర శాఖల సమన్వయంతోనే మలేరియా నిర్మూలన సాధ్యమని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులు పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ భరత్ రాజ్, మూర్తి, ప్రసన్న, శాస్త్రి, శ్రీనివాస్, విజయ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు

## ఎత్తిపోతల పథకం ద్వారా 1200 ఎకరాలకు సాగునీరు విడుదల - ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కిర్లంపూడి, జూన్ 23 (ఆంధ్రప్రదేశ్ సమాచారం, దినపత్రిక) :- కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలోని సోమవారం ఎత్తిపోతల పథకం నుండి రబీ పంటల సాగు కోసం మంగళవారం సాగునీటిని విడుదల చేశారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి సాగునీటిని విడుదల చేశారు. ఎత్తిపోతల పథకం చైర్మన్ జ్యోతుల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సోమవరం, ఇర్రిపాక, కృష్ణవరం, బూరుగుపూడి గ్రామాలకు చెందిన 1200 ఎకరాల ఆయకట్టుకు నీరందనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతు భరోసా నిధులు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలతో రైతులకు అండగా ఉంటున్నామని తెలిపారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఎత్తిపోతల పథకంలోని శిథిలమైన మోటార్ పంపు స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని చైర్మన్ జ్యోతుల కోటేశ్వరరావు కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, ఎంపీపీ తోట రవి, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ, జంపన సీతారామచంద్ర వర్మ, వీరం రెడ్డి కాశి బాబు, నీలం శ్రీను, తూము కుమార్, చదరం చంటిబాబు, కుర్ల చినబాబు, జంపన రవివర్మ, కాళ్ల వెంకటేష్, గంగిరెడ్ల దొరబాబు, మంచి కంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు

## యల్లమిల్లిలో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

గండేపల్లి, జూన్ 23 (ఆంధ్రప్రదేశ్ సమాచారం, దినపత్రిక) :- కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిష్కారం చూపారు. గ్రామంలో తాగునీటి ఎద్దడిని గుర్తించిన ఎమ్మెల్యే, పది రోజుల్లోనే యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయించి ప్రజలకు నీటి సరఫరాను అందుబాటులోకి తెచ్చారు. చెరువుగట్టుపై ఉన్న బోరు నుంచి పైపులైన్లు ఏర్పాటు చేసి, గ్రామంలోని



జీఎల్ఆర్ ట్యాంకుకు నీటిని అనుసంధానించారు. దీని ద్వారా గ్రామంలోని అన్ని ప్రాంతాలకు సురక్షితమైన తాగునీరు అందుతోంది. సమస్యను తెలియజేసిన పది రోజుల్లోనే స్పందించి పరిష్కారం చూపిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభివృద్ధి పనుల పర్యవేక్షణలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ, మద్దిపూడి వీర వెంకట సత్యనారాయణ, దేవిశెట్టి బాబ్జి, కలిపే శేషయ్య, మాదిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## జొన్నాడ సర్వీస్ రోడ్ల పనులు ప్రారంభం ఫలించిన ఎమ్మెల్యే, ఎంపీల ప్రయత్నం

ఆలమూరు, జూన్ 23 (పల్లె వెలుగు దినపత్రిక)



ఏళ్ల తరబడి వాహనదారులకు శాపంగా మారిన కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం జొన్నాడ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ల నిర్మాణం ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతున్న నేపథ్యంలో తక్షణమే ఈ సర్వీస్ రోడ్లు నిర్మించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు,అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ లు చేయని ప్రయత్నం అంటూ లేదు. పాత కాంట్రాక్టర్ సంస్థ "సృతి" ని తప్పించి వేరే వారికి ఇవ్వాలని వీరు పట్టుపట్టారు. కొత్త కాంట్రాక్టు సంస్థకు అప్పగించాలని కేంద్ర రవాణా ఉపరితల మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేయించారు. ఈ నేపథ్యంలో ఆ పాత కాంట్రాక్ట్ సంస్థలో కదలిక వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఈ సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. జొన్నాడ గ్రామం వైపు రోడ్డు రాకపోకలు నిలిపివేసి ఈ పనులను చేపడుతున్నారు. ఈ వారం లోనే ఈ సర్వీస్ రోడ్లు రెండూ నిర్మాణ పూర్తి చేయడానికి కాంట్రాక్ట్ సంస్థ అన్ని చర్యలు చేపట్టింది. అదేవిధంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా వేగవంతం చేసింది. 2022 సెప్టెంబరు 22న రాజమహేంద్రవరంలో జాతీయ రహదారుల రవాణా శాఖ మంత్రి నితిన్ ఘట్కరీ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. మోరంపూడి ఫ్లైఓవర్ మూడు సంవత్సరాలలో పూర్తయినప్పటికీ అదే ప్యాకేజీలో సుమారు రూ. 34 కోట్లతో నిర్మించే జొన్నాడ ఫ్లై ఓవర్ పనులు మాత్రం అప్పటినుంచి సాగుతూనే ఉన్నాయి. నేటికి ఒక రూపు రాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా ఈ సమస్య వెళ్ళింది. ఏళ్ల తరబడి గోతులు పడిన ఈ సర్వీస్ రోడ్లపై రాకపోకలు సాగించడం వాహనదారులకు శాపంగా మారింది. పలువురు ఈ సర్వీసు రోడ్లలో మృత్యువాత పడగా మరికొందరు క్షతగాత్రులుగా మారారు. ఎన్నో వాహనాలు ఈ గోతులలో పడి మరమ్మతులకు గురయ్యాయి.

## ప్రగడ శ్రీకృష్ణ భగవాన్ ఆత్మహత్య కేసులో సంచలన ఆరోపణలు



విజయవాడ, జూన్ 23(పల్లె వెలుగు దినపత్రిక): 2022లో మండపేటకు చెందిన యువకుడు ప్రగడ శ్రీకృష్ణ భగవాన్ ఆత్మహత్య కేసు మరోసారి రాజకీయ దుమారం రేపుతోంది. ఈ ఘటనపై తాజాగా విజయవాడలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ, బాధిత కుటుంబ సభ్యులు మరియు జనసేన నాయకులు మీడియా సమావేశం నిర్వహించి సంచలన ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తమ కుమారుడి మృతికి కారణమైన సీఐ దుర్గాప్రసాద్, డీఎస్పీ బాలచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సత్తి సోమిరెడ్డి లను కాపాడేందుకు అప్పట్లో అధికారంలో ఉన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రయత్నించారని, తమ కుటుంబానికి కనీసం మద్దతు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రిమూర్తులు తమకు న్యాయం చేయకుండా డబ్బు ఆశ చూపారని తల్లి కుమారి కన్నీటిపర్యంతమయ్యారు. పవన్ కళ్యాణ్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్న నేతలు, ఆనాడు తమకు ఎందుకు న్యాయం చేయలేదని జనసేన నేతలు ప్రశ్నించారు. ఈ ఘటనలో బాధితులకు అండగా నిలిచిన 150 మందిపై అక్రమ కేసులు బనాయించడం దారుణమని వారు మండిపడ్డారు.

## శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో పోలీసుల అవగాహన సదస్సు

తిరుపతి, జూన్ 23(పల్లె వెలుగు దినపత్రిక): తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల



మేరకు, అదనపు ఎస్పీ శ్రీలత ఆధ్వర్యం లో శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా భద్రత మరియు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పి మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి వాటిని సహించవద్దు. ఏదైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి, లోన్ యాప్స్, డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ బెట్టింగ్ మరియు గుర్తు



తెలియని లింక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం జాగ్రత్త. యువత క్రమశిక్షణ,మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి. ఏదైనా అత్యవసరమైతే 'శక్తి యాప్' ఉపయోగించండి లేదా 112 (పోలీస్),1930 (సైబర్ క్రైమ్),181 (మహిళా హెల్ప్‌లైన్) నంబర్లకు కాల్ చేయండి. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని అదనపు ఎస్పీ శ్రీలత పిలుపునిచ్చారు

## 81వ డివిజన్ గవరపాలెం ఇంటి ఇంటికి వోటర్ వెరిఫికేషన్



అనకాపల్లి, జూన్ 23 (పల్లె వెలుగు దినపత్రిక): అనకాపల్లి 81వ, డివిజన్ గవరపాలెం ఉమేన్స్ కాలేజ్ రోడ్ 218,219 బూత్ నంబర్ లో అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ,81 డివిజన్ టీడీపీ ఇంచార్జ్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, బి ఎల్ ఓ మరియు బి ఎల్ ఏ తో కలిసి ఇంటి ఇంటికి వోటర్ వెరిఫికేషన్ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్స్ అందరు బీ ఎల్ ఓ కు సహకరించాలని,భారత్ ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాభితా ప్రతిక్య సమగ్ర సవరణ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ లు తో పాటు పార్టీ నాయకులు 80 డివిజన్ టీడీపీ ఇంచార్జ్ జోగి నాయుడు,దాడి వాసు,కాంద్రేగుల చిన్న,పొలమరశెట్టి శ్రీను,పవన్,బుద్ధ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ



అనకాపల్లి, జూన్ 23(పల్లె వెలుగు దినపత్రిక) అనకాపల్లి పట్టణం,రావు గోపాలరావు కళాక్షేత్రంలో వి.ఎం.ఆర్డి.ఏ రీజనల్ కార్యాలయం నందు జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి నియోజవర్గం టిడిపి ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ చైర్మన్ ప్రణవ్ గోపాల్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిస్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు. అనంతరం కోట్లాది రూపాయిలతో మరమ్మాత్తులు చేస్తున్న రావు గోపాలరావు కళాక్షేత్రంలోని నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, 80వ వార్డు టీడీపీ ఇంచార్జి జోగి నాయుడు, తదితరులు, అధికారులు పాల్గొన్నారు.

## జగన్నాథ నవరాత్రోత్సవాలకు ఘన సన్నాహాలు



అనకాపల్లి, జూన్ 23(పల్లె వెలుగు దినపత్రిక): అనకాపల్లి సుభద్ర బలభద్ర జగన్నాథ స్వామి దేవస్థానం లో వచ్చేనెల 16వ తేదీ నుండి నిర్వహించనున్న జగన్నాథ స్వామి నవరాత్రు మహోత్సవాలకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా, మంగళవారం గూడ్స్ రోడ్డు వద్ద ఉన్న ఇంద్రజమున హాల్‌ను దేవస్థాన సిబ్బంది క్షుణ్ణంగా శుభ్రం చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఉత్సవాలను అత్యంత వైభవంగానిర్వహించేందుకు అవసరమైన పనులను చురుగ్గా చేపడుతున్నారు. ఈ పారిశుద్ధ్య పనులు మరియు ఉత్సవాల ఏర్పాట్ల పర్యవేక్షణలో దేవస్థానం చైర్మన్ దాడి బుజ్జి, ఓకే చంద్ర తేజ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ఇతర ముఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు. భక్తులందరూ ఈ నవరాత్రు మహోత్సవాలలో పాల్గొని జగన్నాథ స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ వర్గాలు కోరుతున్నాయి

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com